

దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 24 | సంచిక : 71 | ది.14-5-2025 | విజయవాడ | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-



## ఏపీ, తెలంగాణ నేతల సిఫార్సు లేఖల పునరుద్ధరణకు తాత్కాలిక నిర్ణయం: టిటిడి



**తిరుమల,మే 13 (వార్తాప్రభ) :** తిరుమల శ్రీవారి దర్శనార్థం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సిఫార్సు లేఖల పునరుద్ధరణకు మాత్రమే తాత్కాలికంగా టిటిడి నిర్ణయం తీసుకుంది. ఈ నెల 15వ తేదీ నుండి సదరు నేతల సిఫార్సు లేఖలను మాత్రమే టిటిడి అనుమతించనుంది. అయితే మిగిలిన వారి సిఫార్సు లేఖల పై అంతకు ముందు తీసుకున్న నిర్ణయం కొనసాగుతుంది . నియమావళి ప్రకారం అనుమతి పొందిన భక్తులకు ఈ నెల 16వ తేదీ నుండి శ్రీవారి దర్శనం కల్పించనున్నారు.

# ఈ ఏడాది రూ.1,34,208 కోట్ల ఆదాయం లక్ష్యం

- సాంకేతికత వినియోగంతో పన్ను ఎగవేతలకు చెక్
- అంతర్జాతీయంగా ఎర్రచందనం విక్రయాలకు కమిటీ ఏర్పాటు
- ఆదాయార్జన శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, మే 13 (వార్తాప్రభ) :** రాష్ట్ర ఆదాయం మరింతగా పెంచేందుకు ఉన్న అనుకూలతలు, వేగంగా వృద్ధి చెందడానికి గల అవకాశాలపై ఆదాయార్జన శాఖలన్నీ లోతైన అధ్యయనం చేయాలని... అంతిమంగా రాష్ట్ర ఆదాయం భారీఎత్తున పెరిగేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. గడిచిన 30 ఏళ్ల ఆదాయ ఫలితాలను పరిశీలించి భవిష్యత్ ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సొంత ఆదాయం పెంచుకునేందుకు ఎలక్ట్రానిక్స్, ఐటీ, సేవల రంగాలు ఎక్కువగా దోహదం చేస్తాయని ముఖ్యమంత్రి అన్నారు. మంగళవారం సచివాలయంలో ఆదాయార్జన శాఖలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో శాఖల వారీ పురోగతిపై చర్చించారు. మరోవైపు బంగారం అత్యధికంగా కొనుగోలు చేస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందున్నప్పటికీ... పన్ను ఆదాయం ఆస్థాయిలో ఎందుకు లేదో అధికారులు దృష్టి పెట్టాలని... పన్ను ఎగవేతలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల సమాచారంతో డేటా లేక్ ఏర్పాటు చేయాలని... ప్రతిశాఖకు ఏఐ బృందం ఉండాలని ముఖ్యమంత్రి చెప్పారు. పన్ను చెల్లింపుదారులకు ఏఐ టూల్ ద్వారా సేవలు అందించేలా వచ్చే రెండు, మూడు నెలల్లో ఏఐ ఆధారిత పన్నుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

**మద్యం సరఫరా, అమ్మకాల ట్రాకింగ్ :** పొరుగు రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా రాష్ట్రంలో విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మద్యం విక్రయాలు పారదర్శకంగా జరిగేలా సరఫరా దగ్గర నుంచి అమ్మకం వరకు... ప్రతీది రియల్ టైమ్‌లో ట్రాక్ చేయాలని చెప్పారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో రవాణా శాఖ ఆదాయం పెరుగుతుంటే... ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు తక్కువగా ఆదాయం వస్తోందని ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. దీనికి కారణాలు అన్వేషించి వెంటనే, సరైన విధానాలను అవలంబించి ఆదాయం పెరిగేలా చూడాలని చెప్పారు. నెలవారీ లక్ష్యాలను అధిగమించేలా ఆదాయార్జన శాఖలు ప్రయత్నించాలని అన్నారు.

**ఎర్రచందనం నిల్వలపై సమగ్ర అధ్యయనం :** రాష్ట్రంలో ఎర్రచందనం నిల్వలను అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయించేలా కమిటీ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. వేల కోట్ల రూపాయల విలువైన ఎర్రచందనం మన రాష్ట్రానికి మాత్రమే సొంతమని... దీనిని విక్రయించడం ద్వారా పెద్దఎత్తున ఆదాయం ఆర్జించవచ్చన్నారు. రాష్ట్రంలో ఎన్ని టన్నుల ఎర్రచందనం నిల్వలు ఉన్నాయి...వాటి విలువ ఎంత అనేదానిపై కమిటీ స్పష్టమైన నివేదిక ఇవ్వాలని చెప్పారు.

**29 శాతం అధికంగా ఆదాయార్జన లక్ష్యం ..** వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, గనులు, అటవీ.. ఇలా అన్ని రకాల ఆదాయాలు కలిపి 2025-26 సంవత్సరానికి రాష్ట్ర సొంత ఆదాయం రూ.1,34,208 కోట్లు ఆర్జించాలని లక్ష్యం పెట్టుకున్నారు. ఇది గత ఏడాది కన్నా 29 శాతం అధికం. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి మే 11 వరకు వాణిజ్య పన్నులు, అటవీ ఆదాయంలో తగ్గుదల కనిపించగా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నుంచి అనూహ్యంగా ఆదాయం పెరిగింది. అటు, ఈ ఆర్థిక సంవత్సరం మే 11 వరకు కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆదాయం గతేడాది కన్నా 26 శాతం తగ్గింది. 2024-25లో ఇదే కాలానికి కేంద్రం నుంచి రూ.17,170 కోట్లు రాగా... ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.12,717 కోట్లు మాత్రమే వచ్చింది అని అధికారులు వివరించారు.

**కొత్త ఎక్సైజ్ పాలసీతో పెరిగిన ఆదాయం :** రాష్ట్రంలో కొత్తగా తీసుకువచ్చిన ఎక్సైజ్ పాలసీతో ఆదాయంలో వృద్ధి నమోదైంది. 2024-25లో రాష్ట్రానికి ఎక్సైజ్ ఆదాయం రూ.28,842 కోట్లు వచ్చింది. ఇది అంతకుముందు ఏడాది కన్నా 14.84 శాతం ఎక్కువ. అయితే దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్నాటకతో పోల్చుకుంటే ఏపీలో ఎక్సైజ్ ఆదాయం ఇప్పటికీ తక్కువగానే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నెలలో రాష్ట్రానికి రూ.2,116 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది మొత్తం ఎక్సైజ్ ద్వారా రూ.33,882 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు వివరించారు.

**హైదరాబాద్ లేని లోటు పూడ్చు కోవాలి..** తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నుంచే 75 శాతం ఆదాయం వస్తుందని...మనకు అటువంటి అవకాశం లేనందున ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని సిఎం చంద్రబాబు అన్నారు. ఏడాది కాలంలో తీసుకువచ్చిన పాలసీలను పటిష్టంగా అమలు చేయడం ద్వారా రాష్ట్ర ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సొంత ఆదాయ వనరులు పెంచుకుని తన కాళ్లపై తాను నిలబడాల్సిన అవసరం ఉందని...అప్పుడే అభివృద్ధి, సంక్షేమ పథకాలకు విరివిగా నిధులు ఖర్చు చేయగలం అని సిఎం అన్నారు. కేంద్ర సాయం, అప్పులు అనేది ప్రాథమిక దశలో నిలబడేందుకు మాత్రమే ఉపయోగపడతాయని.... మంచి పనితీరు ద్వారా ఆయా శాఖల్లో ఆదాయం పెరిగే ప్రణాళికలు అమలు చేయాలని సిఎం అధికారులకు స్పష్టం చేశారు. ఒకటి రెండు శాఖలు ఏడాది కాలంలో అనుకున్నంత పురోగతి సాధించలేదని....ఆయా శాఖల పనితీరు మెరుపడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి తెలిపారు.

# ఉద్యానవన సాగుతోనే రైతుకు అత్యధిక ఆదాయం

- ఐదేళ్లలో సాగు రెట్టింపయ్యేలా ప్రణాళికల అమలు
- 11 ప్రాధాన్య పంటలు - 24 క్లస్టర్లుగా అభివృద్ధి
- త్వరలో డ్రిప్ ఇరిగేషన్‌కు ఆటోమెషిన్ పరికరాల ఏర్పాటు
- పండ్లతోటల రైతులకు సబ్సిడీపై ఫ్రూట్ కవర్ల పంపిణీ
- హార్టికల్చర్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, మే 13 (వార్తాప్రభ) :** గోదావరి, కృష్ణా డెల్టా మినహా రాష్ట్రంలో మిగిలిన అన్ని ప్రాంతాల్లోనూ హార్టికల్చర్ సాగును విస్తృతంగా ప్రోత్సహించాలని... రైతుకు ఎకరాకు ఏడాదికి కనీసం లక్ష రూపాయలు ఆదాయం ఆర్జించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులతో అన్నారు. మంగళవారం సచివాలయంలో హార్టికల్చర్‌పై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. మిరప, అరటి, మామిడి, ఆయిల్ పామ్, కోకో, డ్రాగన్ ఫ్రూట్, జీడిమామిడి, కాఫీ, కొబ్బరి, టొమాటో, ఉల్లి.. ఈ 11 ప్రాధాన్య పంటలతో రాష్ట్రంలో 24 క్లస్టర్లు ఏర్పాటు చేసి రైతులకు తోడ్పాటు అందించాలని చెప్పారు.

**లక్ష ఎకరాల్లో కోకో సాగుకు చర్యలు :** 'ప్రస్తుతం రాష్ట్రంలో 18.23 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యానవన సాగును, వచ్చే ఐదేళ్లలో రెట్టింపు చేయాలి. ఆయిల్ పామ్, కోకో, కొబ్బరి పంటల డిమాండ్ దృష్ట్యా రైతులకు ఈ పంటల సాగు విషయంలో అవగాహన కల్పించాలి. ప్రపంచంలో కోకో సాగులో 1 శాతం కన్నా తక్కువగా మన దేశంలో సాగు అవుతోంది. ప్రపంచ మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను అందిపుచ్చుకునేలా లక్ష ఎకరాల్లో కోకో సాగు చేసేలా చూడాలి. కోకో పంట కోసిన తర్వాత నాణ్యత విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకునేలా శిక్షణ ఇవ్వాలి. అలాగే వీటికి అనుబంధంగా చిన్నతరహాలో ప్రాసెసింగ్ యూనిట్లు రైతులే నెలకొల్పేలా చేస్తే మరింత ఆదాయానికి అవకాశం ఉంటుంది. రైతులు పండించే పంటలకు అధిక విలువ తీసుకురావడంపై దృష్టి పెట్టాలి.' అని సీఎం అన్నారు.

**మైక్రో ఇరిగేషన్‌కు అత్యధిక ప్రాధాన్యత :** 'మైక్రో ఇరిగేషన్‌కు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సబ్సిడీని రాష్ట్రంలో రైతులు వినియోగించుకునేలా చూడాలి. ఎస్సీ, ఎస్టీ, చిన్న రైతులకు డ్రిప్ ఇరిగేషన్‌లో ప్రాధాన్యత ఇవ్వాలి. అలాగే ఇప్పటికే రైతులు ఏర్పాటు చేసుకున్న డ్రిప్ ఇరిగేషన్‌కు ఆటోమెషిన్ పరికరాలు అమర్చాలి. దీని ద్వారా నీరు, ఎరువులు ఆదా అవుతాయనే విషయం రైతులకు తెలియజేయాలి.' అని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

**ఫ్రూట్ కవర్ల పంపిణీతో ఉత్తమ ఫలితాలు :** మరోవైపు ఉద్యానవనరంగానికి ఉన్న అవకాశాలను వివరిస్తూ ప్రతి నెలా అన్ని జిల్లాల్లో కాంక్లేవ్‌లు నిర్వహిస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అలాగే 10 వేల హెక్టార్లలో పండ్ల సాగు చేస్తున్న రైతులకు రూ.32 కోట్ల వ్యయంతో ఫ్రూట్ కవర్లు సబ్సిడీపై అందించామని, దీంతో రైతులకు రూ.120 కోట్లు అదనంగా ఆదాయం వచ్చిందని వివరించారు. ఈ సమీక్షలో మంత్రి అచ్చెన్నాయుడు, అగ్రికల్చర్ మిషన్ కార్పొరేషన్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# రూ. 83,500 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరణ

- గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రూ. 10,500 కోట్లు అదనం
- ప్రాధాన్య రంగానికి రూ. 33 వేల కోట్ల రుణ ప్రతిపాదనలు
- బ్యాంకుల వారీగా లక్ష్యాలు చేరుకునేందుకు కృషిచేయాలి
- ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త లక్ష్య సాధనలో కీలక భాగస్వాములు కావాలి
- వినియోగదారుణ్ని ఉత్పత్తిదారునిగా చేసే పీఎం సూర్యఘర్‌పై విస్తృత అవగాహన కల్పించాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,మే 13 (వార్తాప్రభ) :** ప్రజా సంక్షేమం, ఆర్థిక ప్రగతి, సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలను విజయవంతం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమని.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ. 83,500 కోట్ల వార్షిక రుణ ప్రణాళిక (ఏసీపీ) లక్ష్యాలను పూర్తిస్థాయిలో చేరుకునేందుకు బ్యాంకులు కృషిచేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో లీడ్ జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లాస్థాయి సమీక్ష కమిటీ (డీఎల్‌ఆర్‌సీ) సమావేశాలు జరిగాయి. సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి 2025-26 వార్షిక రుణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఎల్‌డీఎం.. గత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనలో వివిధ బ్యాంకుల పాత్ర, బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన కీలక సూచికల్లో ప్రగతి, ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంక్ లింకేజీ రుణాలు, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు తదితరాలను పీపీటీ ద్వారా వివరించారు. అనంతరం మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ రంగానికి రూ. 13,500 కోట్లు, ఎంఎస్‌ఎంఈ రంగానికి రూ. 17వేల కోట్లు రుణ లక్ష్యాలను ప్రతిపాదించినట్లు తెలిపారు. మొత్తం ప్రాధాన్యరంగానికి రూ. 33 వేల కోట్లు, ప్రాధాన్యేతర రంగానికి రూ. 50,500 కోట్ల మేర లక్ష్యాలను రుణ ప్రణాళికలో పొందుపరిచినట్లు వివరించారు. ఇతర ప్రాధాన్య రంగానికి రూ. 2,495 కోట్ల రుణాలను ప్రతిపాదించినట్లు తెలిపారు. గతేడాది రుణ ప్రణాళిక లక్ష్యాల సాధనలో బ్యాంకులు మంచి ప్రగతి కనబరిచాయని.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ బ్యాంకులు మరింత కీలకంగా వ్యవహరించి, లక్ష్యాలను చేరుకునేందుకు కృషిచేయాలన్నారు. వినియోగదారుణ్ని ఉత్పత్తిదారునిగా మార్చే, పర్యావరణ హిత, ఆర్థిక వృద్ధి చోదక పీఎం సూర్యఘర్ పథకంపై పెద్దఎత్తున అవగాహన కల్పించాలని, లక్ష్యాల మేరకు లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. ప్రధానమంత్రి ముద్రా యోజన, స్టాండప్ ఇండియా, పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ, ఏపీ టిడ్కో తదితర పథకాల ద్వారా చివరిమైలు వరకు లబ్ధిచేకూరేలా బ్యాంకులు మద్దతు అందించాలని సూచించారు. ఏపీ టిడ్కోపైనా ప్రత్యేకంగా దృష్టిసారించాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయూతనందించాలన్నారు. గౌరవ ముఖ్యమంత్రి ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త లక్ష్యాలు నెరవేరాలంటే బ్యాంకుల మద్దతు చాలా ముఖ్యమని మంత్రివర్యులు సత్యకుమార్ యాదవ్ అన్నారు.

**వినూత్న ఆలోచనలతో ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

వికసిత్ భారత్ - 2047, స్వర్ణాంధ్ర ఏ 2047 లక్ష్యాలు నెరవేరాలంటే బ్యాంకుల భాగస్వామ్యం చాలా ముఖ్యమని.. జిల్లాలో వినూత్న ఆలోచనలతో ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త కింద పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని.. ఇందుకు బ్యాంకులు లబ్ధిదారులకు అవసరమైన రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్ఫూర్తితో త్వరితగతిన దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. ఈ ఏడాది స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 855 కోట్ల మేర జీవనోపాధి రుణాలు మంజూరు జరుగుతున్నందున వాటిని సద్వినియోగం చేసుకునేలా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా జిల్లా అధికార యంత్రాంగం కృషిచేస్తోందని, ఇందులో బ్యాంకులు కూడా భాగస్వాములై 100 శాతం లక్ష్యాల సాధన దిశగా కృషిచేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయానికి ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. జిల్లా జీవీఏ (స్థూల విలువ జోడింపు)ను పెంచేందుకు పశు సంవర్ధక, ఉద్యాన రంగాల్లో మంచి అవకాశాలున్నాయని.. ఉపాధి హామీ పథకం కింద ప్రతి గ్రామంలోనూ పెద్దఎత్తున ఉద్యాన పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి సృష్టితో పాటు పశు ఉత్పాదకతను పెంచేందుకు, పాడి రైతులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (ఎన్‌ఎల్‌ఎం)ను సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. రూ. 30 వేల కోట్లతో నాబార్డ్ రుణ ప్రణాళిక: సమావేశంలో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ (నాబార్డ్) జిల్లా ప్రాధాన్యత రంగానికి సంబంధించి దాదాపు రూ. 30 వేల 48 కోట్లతో పొటన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ (పీఎల్‌పీ)ను కూడా ఆవిష్కరించారు. సమావేశంలో డీసీసీ కన్వీనర్, యూబీఐ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, ఆర్‌బీఐ ఎల్‌డీవో సీహెచ్ నవీన్ కుమార్, నాబార్డు డీడీఎం మిలింద్ చౌసాల్కర్, ఎల్‌డీఎం కె.ప్రియాంక, ఆర్‌సేతి డైరెక్టర్ అమరేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, టిడ్కో ఈఈ చిన్నోడు, డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.కిరణ్ కుమార్ వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.

# రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్
- పారిశ్రామికవేత్తలకు అనుకూల వాతావరణం రాష్ట్రంలో కల్పిస్తున్నాం
- రాష్ట్రాభివృద్ధిలో అధికారులు కూడా భాగమవ్వాలి
- ఏపీఐఐసీ కార్యాలయంలో నిర్వహించిన జీ.యంల కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి టి.జి భరత్



**గుంటూరు,మే 13 (వార్తాప్రభ) :** ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఎంతో ఆసక్తి చూపుతున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ పేర్కొన్నారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో అన్ని జిల్లాల జీ.యంలతో నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో పరిశ్రమల శాఖ కమిషనర్, ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త్ కిషోర్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాల్లో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు, పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్న కంపెనీలకు సంబంధించిన అనుమతుల వివరాలు ఆరా తీశారు. గత 5 ఎస్.ఐ.పి.బి సమావేశాల్లో ఆమోదించిన పెట్టుబడులకు చెందిన ప్రాజెక్టులపై చర్చించారు. ఆర్సెలార్ మిట్టల్, బిపిసిఎల్, ఎల్.జి ఎలక్ట్రానిక్స్, టఫే, టాటా కన్సల్టెన్సీతో పాటు అన్ని కంపెనీల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం ఇండస్ట్రియల్ పాలసీ ఎంఎస్‌ఎంఈ పాలసీలను వివరించారు. పారిశ్రామికవేత్తలకు ఇవ్వాల్సిన రాయితీల గురించి జిల్లాల వారీగా, పరిశ్రమల వారీగా చర్చించారు. అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. పారిశ్రామికవేత్తలు ఏ జిల్లాలో పరిశ్రమలు పెడుతున్నారో అక్కడి అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోందన్నారు. పరిశ్రమలు పెట్టేందుకు అనుమతులు ఇచ్చే విషయంలో ఎలాంటి సమస్య ఉండకూడదన్నారు. క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఏమైనా ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాష్ట్రాభివృద్ధిలో అధికారులు భాగమవ్వాలని మంత్రి చెప్పారు. పెద్ద పెద్ద కంపెనీలతో పాటు ఎంఎస్‌ఎంఈలకు ప్రభుత్వం ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ పార్క్‌లు ఏర్పాటవుతున్నాయన్నారు. దీని ద్వారా స్థానికంగా పెట్టుబడులు రావడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. పరిశ్రమల ఏర్పాటులో జిల్లా స్థాయిలో జీ.యంల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి ఒక్క అధికారి బాధ్యతగా పనిచేయాలని మంత్రి టి.జి భరత్ ఆదేశించారు.

# మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం నుంచి అటవీ భూములను రక్షించలేని వారిపై చర్యలు

- విజిలెన్స్ డి.జి. నివేదిక సిఫార్సులకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు



**విజయవాడ, మే 13 (వార్తాప్రభ) :** మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం చిత్తూరు జిల్లాలో అటవీ, ప్రభుత్వ, బుగ్గ మఠం భూములను ఆక్రమణలపై వచ్చిన ఆరోపణలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డి.జి. విచారణ చేసి నివేదిక ఇచ్చారు. ఈ నివేదికలో సంబంధిత శాఖల భూములు అక్రమణలకు గురవుతుంటే రక్షించలేని వారిని బాధ్యులను చేయాలని, ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సిఫార్సు చేసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఈ నివేదికను పరిశీలించారు. అటవీ భూముల అక్రమణలకు సంబంధించిన అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డి.జి. సిఫార్సులకు అనుగుణంగా చర్యలకు ఉపక్రమించాలని పవన్ కల్యాణ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. అటవీ భూములను సంరక్షించలేకపోయిన అధికారులను గుర్తించి నివేదిక రూపొందించి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా భూములు ఆక్రమించినవారిపై క్రిమినల్ కేసులతోపాటు, అటవీ పర్యావరణ చట్టాలను అనుసరించి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

# తెలంగాణలో నాలుగు రోజులు భారీవర్షాలు..పది జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్

**విశాఖపట్నం,మే 13 (వార్తాప్రభ) :** గత కొద్ది రోజులుగాఎండలు దంచికొడుతున్న విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ముఖ్యంగా తెలుగు రాష్ట్రో ఎండలు రికార్డుస్థాయిలో నమోదు అవుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉదయం పది దాటిందంటే చాలు ఇండ్లనుంచి బయటికి వెళ్లే పరిస్థితి లేదు. ఈ క్రమంలో వాతావరణ శాఖ తెలుగు రాష్ట్రాల ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పింది. రానున్న నాలుగు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. సముద్రంలో అల్పపీడన ద్రోణి కారణంగా మంగళవారం(మే13) నుంచి నాలుగు రోజుల పాటు తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం, బుధవారం, గురువారం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలతో వర్షాలు కురిస్తాయని అంచనా వేసింది. మరికొన్ని జిల్లాల్లో వడగండ్ల వాన కురిసే అవకాశం ఉందని పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. రాగల మూడురోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని తెలిపింది. మంగళవారం నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల్లో 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షం కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మంగళవారం వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాలలో 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, నాగర్కర్నూల్ జిల్లాల్లో ఈదురు గాలులు గాలి వేగం గంటకు 40-50 కి.మీతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే ఛాన్స్ ఉందని ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలలో ఉరుములు, మెరుపులు,ఈదురు గాలులు (గాలి వేగం గంటకు 30-40 కి.మీ)తో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# ఘనంగా శ్రీ షిరిడి సాయి సేవ మందిరం 21వ వార్షికోత్సవం



**విస్సన్నపేట,మే 13 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో 21 సంవత్సరాల క్రితం వేదపండితులు నిర్ణయించిన బ్రహ్మ ముహూర్తంలో మంగళ వాయిద్యాల మధ్య వేద పండితుల వేదమంత్రోచ్చరణలతో ప్రతిష్టించిన శ్రీ షిరిడి సాయి సేవ మందిర సాయికి భక్తులు లక్ష మల్లెల అర్చన నిర్వహించారు. 22 సంవత్సరంలో అడుగుపెడుతున్న శుభ సందర్భంగా సాయినాధునికి ఘనంగా పూజలు జరిపి అన్న ప్రసాద్ వితరణ నిర్వహించారు

# సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయ అధికారిగా జి.మమ్మీ బాధ్యతలు స్వీకరణ



**కాకినాడ,మే 13 (వార్తాప్రభ) :** డాక్టర్ బిఆర్ .అంబేద్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌గా జి.మమ్మీ నియామకం పొందారు. ఇప్పటి వరకు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషా ఏపీసీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో ఏపీసీగా మమ్మీని నియమిస్తూ సమగ్ర శిక్షా స్టేట్ ప్రాజెక్టు డైరెక్టరు శ్రీనివాసరావు ఉత్తర్వులు ఇచ్చారు. ఏపీసీగా మమ్మీ బాధ్యతలు స్వీకరించిన అనంతరంఆమె జిల్లా జాయింట్ కలెక్టరు టి.నిషాంతి, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం బాషాను మ ర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏపీసీ మమ్మీ మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జరుగుతున్న పథకాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

# శుభాకాంక్షలు చెప్పిన టీడీపి పెద్దలు



**విస్సన్నపేట,మే 13 (వార్తాప్రభ) :** జిల్లా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ గా ఎంపికైన నెట్టెం రఘురామ్ ను ఆర్ బి ఎస్ జాతీయ అధ్యక్షులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వర రావు, జిల్లా టిడిపి నాయకులు రాయల సుబ్బారావు మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టు శాలువాతో సన్మానించి సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పాల సజ్జను వారు అందించారు.

# వైఎస్సార్ పార్టీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

- పోటీలను ప్రారంభించిన వైసీపీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి



**అమలాపురం,మే 13 (వార్తాప్రభ) :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరం నియోజకవర్గ పరిధిలోని ముక్కామలలో వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ వైసీపీ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ క్రీడల ద్వారా ప్రతి ఒక్కరు ఉత్తేజంగా జీవనం సాగిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ గన్నవరపు శ్రీనివాసరావు, అమలాపురం నియోజకవర్గ కన్వీనర్ పినిపే శ్రీకాంత్,ఎంపీపీ దొమ్మేటి ఉమామహేశ్వరరావు, జెడ్పిటిసి బూడిద వరలక్ష్మి ,వైసీపీ పార్టీ మండల అధ్యక్షులు విత్తనాల ఇంద్ర శేఖర్,పీకే రావు వైసీపీ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, కుడుపూడి భరత భూషణ్, నాయకులు ఉందుర్తి నాగబాబు, వాసంశెట్టి తాతాజీ, మట్టపర్తి మీరా సాహెబ్ శెట్టి, సత్య మోహన్ కే.కోటబాబు, మట్టపర్తి హరి,కుడుపూడి శాంతిభూషణం, గౌతమ్, సాయి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు

# రోడ్డు పాడైపోతుంది... పట్టించుకోండి అధికారులకు ప్రజలు వినతి



**ఆగిరిపల్లి,మే 13 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి మెట్ల కోనరు దగ్గర ఉన్న డ్రైనేజీ గత 20 రోజులు నుండి పొంగి ప్రవహిస్తుంది. దాని వలన ఒక కిలోమీటర్ వరకు తారు రోడ్డు పాడైపోయింది. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజ్ నీరు ప్రవహించడం వలన ప్రజలు బాగా ఇబ్బంది గురివుతున్నారు. కావున అధికారులు దీని గమనించి త్వరితగతిన ఆ డ్రైనేజీ లో పేరుకుపోయి ఉన్న పూడికను తీసి రోడ్డు ను బాగుపరచగలరు.

# అహిర్ రెజిమెంట్ మా హక్కు

- జాతీయ రక్షణ కోసం అహిర్ రెజిమెంట్
- రేజింగ్ లా కలశ యాత్ర ఆంధ్ర ప్రదేశ్ కన్వీనర్ బంకా దత్తాత్రేయ యాదవ్ పిలుపు



**విజయవాడ, మే 13 (వార్తాప్రభ) :** భారత సైన్యంలో అహిర్ రెజిమెంట్ ( యాదవ రెజిమెంట్ ) ను ఏర్పాటు చేయాలని అఖిల భారత యాదవ మహాసభ "రేజింగ్ లా కలశ యాత్ర" ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ బంకా దత్తాత్రేయ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ సాధన కోసం భారత దేశ మొత్తం కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు "రెజాంగ్ లా కలశ యాత్ర"ను అఖిల భారత యాదవ మహాసభ ప్రారంభించినట్లు "వార్తా ప్రభ"కు దత్తాత్రేయ తెలిపారు. రెజాంగ్ లా రాజ్ కలశ్ యాత్ర బీహార్ లో ఎప్రిల్ 13 వ తేదిన మొదలయ్యిందనీ,బీహార్ నుండి జార?ండ్ , బెంగాల్ , ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హర్యానా, ఢిల్లీలో పర్యటించి చివరగా నవంబర్ 18న ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో యాత్ర ముగుస్తుంది. అంధ్ర ప్రదేశ్ లో "రేజాంగ్ లా రాజ్ కలశ్ యాత్ర" జూన్ 30 న ఇచ్చాపురం నుండి బయలు దేరి జూలై 14 , తిరుపతి లో ముగుస్తుందన్నారు. ప్రపంచంలో ఇప్పటివరకు జరిగిన 8 యుద్ధాల్లో రేజంగ్లా యుద్ధం కథ దేశానికి గర్వకారణమన్నారు. 18 నవంబర్ 1962న, భారతదేశంలోని లడఖ్‌లోని రెజాంగ్ లా పాస్ వద్ద చైనా తో పోరాడిందన్నారు.కుమావోన్ రెజిమెంట్ లో 120 మంది యాదవ సైనికులు ఉన్నారన్నారు. వీరికి మేజర్ షైతాన్ సింగ్ నాయకత్వం వహించారన్నారు. 120 మంది అహిర్ లు ( యాదవులు) భారతీయ సైనికులు 5000 మంది చైనీస్ దళాలను ఎదుర్కొన్నారన్నారు . ఈ దాడిలో 1310 మంది చైనా సైనికులను హతమార్చారనీ,114 మంది ధైర్యవంతులైన అహిర్లు భారతమాత రక్షణలో అమరులయ్యారన్నారు. 3 నెలల తరువాత 10 ఫిబ్రవరి 1963న యుద్ధభూమిని సందర్శించిన భారతీయ శోధన బృందం నిర్ఘాంత పోయే విషయాలను చవిచూసిందన్నారు.చనిపోయిన వ్యక్తుల ఘనీభవించిన మృతదేహాలు ఇప్పటికీ వారి చేతుల్లో తు-పాకీలను పట్టుకుని, వారి ఛాతీపై బుల్లెట్లను కలిగి ఉన్నాయన్నారు. యాదవ శౌర్యం వలనే చైనా పురోగతిని విజయవంతంగా ఆపడమే కాకుండా, చుషుల్ విమానాశ్రయాన్ని రక్షించ కల్గిందన్నారు. తద్వారా 1962లో లడఖ్ ప్రాంతమంతా చైనా ఆక్రమించడాన్ని నిరోధించిందన్నారు. వీరి జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం మరియు భారత సైన్యం రెజాంగ్లాలో అహిర్ ధామ్ కూడా నిర్మించారన్నారు.స్వతంత్ర పోరాటంలోనూ, దేశ రక్షణ కోసం ఎన్నో ఏళ్లుగా ముందుండి పోరాడి త్యాగం చేసిన ( అహిర్ ) యాదవుల కోసం అహిర్ రెజ్మెంట్ ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాగైతే యాదవుల శౌర్య పరాక్రమాలు దేశ ప్రజలకు తెలియపరచాలనే లక్ష్యంగా అఖిల భారత యాదవ మహాసభ జాతీయ పెద్దలు నిర్ణయించినట్లు శ్రీ దత్తాత్రేయ తెలిపారు. దేశ రక్షణకు కట్టుబడి ప్రాణాలను బలిపెట్టిన యాదవ వీరులకు గుర్తుగా గతంలో ఉన్న ఆహిర రెజిమెంట్ ను పునర్దించాలని డిమాండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# వేణుగోపాలరావు పై చర్యలకు అడ్డుపడుతున్న మున్సిపల్ కమిషనర్ పై డిఎంఎ కు ఫిర్యాదు



**పెడన,మే 13 (వార్తాప్రభ) :** పట్టణంలో చర్చనీయాంశంగా మారిన 18 సెంట్లు పంచాయతీ మున్సిపల్ ఉన్నతాధికారి వద్దకు చేరింది.పెడన మున్సిపాలిటీకి చెందిన ఆర్ఎస్ నెంబర్ 366-1-బి లో 18 సెంట్లు స్థలాన్ని విక్రయించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు వేణుగోపాలరావు పై సివిల్ అండ్ క్రిమినల్ చర్య తీసుకోవడానికి వీలు లేకుండా మున్సిపాలిటీ స్థలాన్ని విక్రయించిన వారికి మద్దతు పలుకుతున్న కమిషనర్ గోపాలరావు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (సిడిఎంఎ) సంపత్ కుమార్ ను అమరావతి లోని అయన చాంబర్ లో మంగళవారం కలసి సీనియర్ కౌన్సిలర్లు కటకం ప్రసాద్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసారు. ఈ సంవత్సరం జనవరి 21న పెడన మున్సిపాలిటీకి చెందిన 9వ వార్డు కౌన్సిలర్ చంద్రబాబు లేఖ ద్వారా ఒక అంశము కౌన్సిల్ నందు అజెండాలో చేర్చి చర్చించి తీర్మానించి ప్రభుత్వానికి పంపించవలసిందిగా కోరారు. ఈ విషయము విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ రిపోర్ట్ నెంబర్ 84 సి నెంబర్ 1241/బి అండ్ జీ/ డి 1-2025 ప్రకారం ఇది 06-అక్టోబర్ 2017 వ తేదీన విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్ వారు పెడన మున్సిపాలిటీ వారికి తెలిపిన విధంగా పెడన మున్సిపాలిటీకి చెందిన ఆర్ఎస్ నెంబర్ 366-1బి లో యం- 18 సెంట్లు తామరచెరువు ప్రభుత్వ స్థలాన్ని వేణుగోపాల్ రావు ప్రైవేట్ వ్యక్తులకు ది 16జూన్ -2014 వ తేదీన విక్రయించి రిజిస్ట్రేషన్ చేయుట జరిగినది. మున్సిపాలిటీకి చెందిన యం- 18 సెంట్లు స్థలాన్ని అక్రమంగా అమ్ముకుని సొమ్ము చేసుకున్న వారిపై సివిల్ అండ్ క్రిమినల్ చర్యలు తీసుకునే నిమిత్తం కౌన్సిల్ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపవలసిందిగా కోరడమైనది కానీ కౌన్సిల్ సమావేశం లో ఈ విషయాన్ని ఒక అంశముగా చేర్చి కమిషనర్ కు పంపడం జరిగింది. కమిషనర్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వారికి లీగల్ ఒపీనియన్ నిమిత్తం పంపించారు.వారి వద్ద నుండి ఈ అంశము న్యాయ సమ్మతము గానే ఉందని రిపోర్టు ఇవ్వడం కూడా జరిగింది కానీ జనవరి ఫిబ్రవరి మార్చి నెలల్లో జరిగిన సమావేశాలకు కమిషనర్ నోట్ ఫైల్ ద్వారా తీసుకురాలేదు.సభ్యులు కౌన్సిల్ సమావేశంలో పలుమార్లు అడిగినను సమాధానం దాటవేస్తూ కాలయాపన చేస్తున్నారు.ఈ విషయమై మార్చి కౌన్సిల్లో ఒక అంశముగా చేర్చుతానని కమిషనర్ సమాధానం ఇచ్చారు. కానీ మళ్ళా ఏప్రిల్ నెల సమావేశానికి 9వ వార్డు కౌన్సిలర్ కోరిన అంశమును అజెండాలోనికి తీసుకొని రాకపోగా జీవో నెంబర్ 624 తేదీ 24 అక్టోబర్ 2019 అధికారులపై ఎంక్వైరీ వేస్తూ ఇచ్చిన జీవో సాకుగా చూపిస్తూ 9వ వార్డు కౌన్సిల్ సభ్యులకు తప్పుడు ఎండార్స్మెంట్ పోస్ట్ ద్వారా ఏప్రియల్ మూడో తేదీన పంపించారు. పై విషయమును విచారించి మున్సిపాలిటీకి చెందిన ఆర్ఎస్ నెంబర్ 366-1 బి లో 18 సెంట్లు స్థలాన్ని విక్రయించిన వేణు పై చర్యలు తీసుకోవాల్సిందిగా మున్సిపాలిటీ స్థలాన్ని విక్రయించిన వ్యక్తులకు మద్దతు పలుకుతున్న మున్సిపల్ కమిషనర్ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాల్సిందిగా సిడిఎంఎ ని కోరారు. డీఎంఎ ను కలసిన వారిలో 8వ వార్డు కౌన్సిలర్ కటకం ప్రసాద్ వైస్ చైర్మన్ మొహమ్మద్ ఖాజా 9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కి సుభాష్ చంద్రబాబు 18 వార్డ్ ఇంచార్జ్ కోమట్ల అనిల్ కుమార్ పాల్గొన్నారు.

# రాయితీపై పశువుల దాణా పంపిణీ చేసిన ఎంఎల్ఎ కృష్ణప్రసాద్




**పెడన,మే 13 (వార్తాప్రభ) :** పట్టణం లో పశు పోషకులకు 50 శాతం రాయితీపై పశువుల దాణాను స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పంపిణీ చేశారు. స్థానిక పశువైద్యాధికారి ఆధ్వర్యంలో పట్టణ పశు వైద్యశాల నందు మంగళవారం దాణా ను పంపిణీ చేశారు. ఈ దాణాలో 25 శాతం మాంసకృత్తులు ఉంటాయని పశు వైద్యాదికారి పశు పోషకులకు వివరించారు. వేసవిలో వీటి ద్వారా పాల దిగుబడి వెన్న శాతం తగ్గకుండా ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందని ఆయన వెల్లడించారు. పశుపోషకులు 80 శాతం రాయితీతో పశువులకు ఆవులకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వ రాయితీ పోను మూడు సంవత్సరాల కాలానికి కేవలం పశు పోషకులు 30 వేల రూపాయలు విలువచేసే పశువుకు 1920 రూపాయలు గాను సబ్సిడీ పోను 288 రూపాయలు మాత్రమే చెల్లించాలని వివరించారు. ఇన్సూరెన్స్ చేయించుకోవడం ద్వారా పశువులు ఆవులకు ఎంతో రక్షణ ఉంటుందని ఆయన అన్నారు.వేసవిలో పశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పశు పోషకులకు వివరించారు. విపత్తుల వల్ల అకాల వర్షం పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా చెట్ల కింద వారి పశువులను గొర్రెలు మేకలను నిలపరాదన్నారు. పశువులను మేపునకు తీసుకున్న తదుపరి లవణ మిశ్రమాలను అధికంగా పెట్టాలన్నారు. ప్రభుత్వం పశుపోషకుల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తూ చేయూత నిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద రాయితీపై మినీ గోకులాలు కేటాయించినట్టు ఆయన తెలిపారు. రాయితీపై పశుగ్రాస విత్తనాలు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెడన కృష్ణా మిల్క్ యూనియన్ జిల్లా డైరెక్టర్ అర్జ నగేష్ పెడన మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు శలపాటి వీర ప్రసాద్ మండల ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్ శౌంఠి రాము పశు వైద్య సిబ్బంది కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్దాపురం నియోజకవర్గంలో రూ.13 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కు



**పెద్దాపురం,మే 13 (వార్తాప్రభ) :** పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన పెద్దాపురం ఏడీబీ రోడ్డు వద్ద ఏపీఐఐసీ ఆధ్వర్యంలో రూ.13 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కుకు మంగళవారం రాష్ట్ర రెవెన్యూ స్టాపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్,జిల్లా కలెక్టరు షణ్మోహన్, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్నరాజప్ప,కౌడా చైర్మన్ తుమ్మల రామస్వామి, జాయింట్ కలెక్టరు రాహుల్ మీనా శంఖుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ..గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు భవిష్యత్తు తరాల కోసం ఆలోచించే నాయకుడన్నారు. ఉపాధి కల్పన తోపాటు ఆర్థికంగా రాష్ట్రాన్ని నెంబర్ వన్ గా నిలిపేందుకు ప్రతి కుటుంబానికి ఒక పారిశ్రామిక వేత్త అనే నినాదాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చారని ఆయన తెలిపారు. ప్రతి కుటుంబానికి ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడం కోసమే ప్రతి నియోజకవర్గంలోనూ ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలో ప్రతి ఇంటికి ఒక ఐటీ ఉద్యోగి అని చంద్రాబాబు పిలుపునిస్తే చాలా మంది ఎగతాళి చేశారని కానీ ఆ ఫలితాలను మనం గత 20 ఏళ్లలో చూశామన్నారు. విజన్-2047 ద్వారా స్వర్ణాంధ్ర సాధించాలంటే పారిశ్రామిక రంగంలోనూ ప్రగతి చాలా అవసరం మని,ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు కారణంగా ఉపాధి కల్పన జరగడమే కాకుండా ఆర్థికంగానూ రాష్ట్రం పరిపుష్టం అవుతుందన్నారు. పారిశ్రామిక వేత్తలుగా మారే యువతను ప్రోత్సహించేందుకు పెట్టుబడినిధిలో, విద్యుత్ బిల్లుల్లో తోపాటు అనేక అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలు అందిస్తోందని మంత్రి తెలిపారు. మరో రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ.. భారతదేశ ప్రధానంగా వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉందన్నారు. వ్యవసాయ రంగంతో పాటు పారిశ్రామిక రంగంపై ఆధారపడేలా గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ మేకిన్ ఇండియా పిలుపు మేరకు స్థానికంగానే పరిశ్రమ స్థాపించి పదిమంది యువతకు ఉపాధి కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈ పార్కులు నిర్మాణం చేపడుతుందని రాష్ట్ర మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టరు షణ్మోహన్ మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసే ఎంఎస్ఎంఈ పార్కులలో పెద్దాపురం నియోజకవర్గంలో ఏర్పాటు చేసే ఎంఎస్ఎంఈ పార్కు అతిపెద్దదన్నారు. సుమారుగా 29 ఎకరాల్లో రూ.13కోట్ల వ్యయంతో ఈ పార్కు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని జిల్లా కలెక్టరు తెలిపారు. ఈ పార్కును ప్లాట్లుగా విభజించి పరిశ్రమ స్థాపనకు అవసరమైన రోడ్లు, విద్యుత్,నీరు వంటి ఇతర వసతులు అన్ని ఈ ఎంఎస్ఎంఈ పార్కులో ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.ఈ పార్కును రానున్న సంవత్సర కాలంలో నిర్మాణ పనులు పూర్తి చేసుకుని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టరు షాన్ మోహన్ తెలిపారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన్నరాజప్ప మాట్లాడుతూ పెద్దాపురంలో 29 ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పార్కు ద్వారా 5వేల మంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందుకోవచ్చు అని ఆయన తెలిపారు. సూక్ష్మ,చిన్న,మధ్య పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు రాజా పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి,ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.రమణారెడ్డి, డీఎల్డీవో కెవిస్వీ.ప్రసాద్ రావు,ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జి.కొండూరు అంగన్వాడీ కేంద్రాలలో 'కిషోరి వికాసం'

- పోక్సో చట్టం పై కిషోర బాలికలకు అవగాహన కల్పించిన ఎం ఎస్ కె లు





**జి.కొండూరు,మే 13 (వార్తాప్రభ) :** స్థానిక గ్రామ సచివాలయం-1,గ్రామ సచివాలయం-2 పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల లో కిషోరి వికాసం కార్యక్రమాన్ని సచివాలయాల మహిళా పోలీసులు(ఎం ఎస్ కె) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.అంగన్వాడీ కేంద్రం- 1, అంగన్వాడీ కేంద్రం-2 లలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ కె లు లీల, ఇంద్రజ కిషోర బాలికలకు బాలల హక్కులు,రక్షణ,పోక్సో చట్టం పై అవగాహన కల్పించారు.బాలికల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధచూపడంతోపాటు బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు వాటినుంచి బాలికలు ఎదుర్కొనే మార్గాలు గురించి వారు బాలికలకు వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బి.వాణి,ఈ.నాగమణి, బి.జయ కుమారి,కె హేన, పి.విష్ణు చందన, వి.విజయం నిర్మల, బి.జ్యోతి, యమ్ మేరీ పాల్గొన్నారు.

# రేపటి నుండి హజ్రత్ మీరా హుస్సేని (ర.అ) వారి 269వ ఉర్సు మహోత్సవాలు



**నందిగామ,మే 13 (వార్తాప్రభ) :** హజరత్ సయ్యద్ షా మీరా హుస్సేనీ ఖాదరి (ర. అ)"వారి 269వ ఉర్సు మహోత్సవములు ఈనెల 15,16వ తేదీలలో జరుగుతాయని దర్గా ముజావర్లు తెలిపారు. మంగళవారం దర్గా ముజావర్లు మీడియాతో మాట్లాడుతూ స్థానిక పెద్ద మ-సీదు ఆవరణలో గల "హజరత్ సయ్యద్ షా మీరా హుస్సేని ఖాదరి(ర. అ)"వారి 269 వ గంధం మహోత్సవములు అత్యంత వైభవంగా గురువారం,శుక్రవారం రెండు రోజులు జరుగుతాయన్నారు.రేపు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల మర్హుం షేక్ గౌసుల్లా (ఆర్టీసీ డ్రైవర్) ఇంటి వద్ద నుండి హజ్రత్ వారి గంధం మహోత్సవం మేళతాళాలతో భారీ లైటింగ్ సెట్టింగ్లతో ఊరేగింపుగా బయలుదేరి దర్గా షరీఫ్ కి చేరుకుంటుందని తెలిపారు.శుక్రవారం సాయంత్రం దర్గా షరీఫ్ లో హజ్రత్ వారి "చిరాగా"అనగా దీపారాధన కార్యక్రమం జరుగుతుందని అనంతరం భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేయడమైనదని ముజావర్లు తెలిపారు.

# తవ్వా పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**హనుమాన్ జంక్షన్, మే 13 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ దుర్గా వాసు జనరల్ స్టోర్స్ అధినేత తవ్వా పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ రోడ్ లోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ప్రక్కన బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. మండుటెండలో గత మూడు మంగళవారాలు గా ఈ బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ నెలలో మరో రెండు మంగళవారాలు మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు దాత తవ్వా పూర్ణచంద్రరావు తెలిపారు.

# శ్రీ అయ్యప్ప స్వామి భక్త బృందం వారిచే ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం....




**కృత్తివెన్ను,మే 13 (వార్తాప్రభ) :** భగభగ మండుతున్న ఎండలకు గొంతులో కాసిన్ని మంచినీళ్లు పడితే ప్రాణం కాస్త కుదుటపడుతుంది. మరి చల్లటి మజ్జిగ తాగితే మరింత ఉపశమనం కలుగుతుందని భావించి, స్థానిక బంటుమిల్లి గ్రామంలోని గాంధీ బొమ్మ సెంటర్ నందు శ్రీ అయ్యప్ప స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో, గురు స్వామి కొల్ల రామచంద్ర రావు పర్యవేక్షణలో, గత నెల 16వ తారీకు నుంచి వేసవికాలం అన్ని రోజులు కూడా దాతల సహకారంతో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా కొల్లా రామచంద్రరావు గురుస్వామి మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా వేసవికాలం అన్ని రోజులు దాతల సహాయ సహకారాలతో ఈ ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరుగుతుంది అని ఆయన తెలియజేశారు.

# భూగర్భ నీటి మట్టం పెరగాలంటే వర్షపు నీటిని ఇంకుడు గుంతల్లో నింపాలి

## కోలా రవీందర్ ముదిరాజ్





**కుత్బుల్లాపూర్ మే 13 (వార్తాప్రభ) :** ప్రతిఇంటికి ఇంకుడు గుంత ఉండేలా ప్రభుత్వం కఠిన నిబంధనలు పెట్టాలని సామాజిక, పర్యావరణ రక్షకుడు కోలా రవీందర్ ముదిరాజ్ అన్నారు. 20 సంవత్సరాల క్రితం తన ఇంటిలోని ఇంకుడు గుంతను పునః నిర్మాణం లో భాగంగా ఇసుక, కంకరతోనింపుతున్న రవీందర్ ముదిరాజ్ భవిష్యత్తులో వర్షపు నీరే జీవనాధారం కావున ఇంకుడు గుంత ఉంటేనే రిజిస్ట్రేషన్ చేసే విధంగా సంబంధిత శాఖకు ఆదేశాలు ఇవ్వాలని, లేఔట్ లు చేసేవారు తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తేనే వారికి హెచ్ఎండిఏ అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో 3000 అడుగులు వేసిన మూడు చుక్కల నీరు రాని పరిస్థితి కలుగుతుందని, కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి ఉన్న చెరువుల పూడికలు తీసి లోతు పెంచాలని, ఇంకుడు గుంత ఉంటేనే మెట్రో వాటర్ వర్క్స్ శాఖ నీరు పంపే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని, తదుపరి ప్రతి ఒక్కరు కూడా ఇంకుడు గుంత తీసే విధంగా అవగాహన కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంట్లో ఇంకుడు గుంతలు పునరుద్ధరిస్తున్న పర్యావరణ ప్రేమికుడు సామాజిక కార్యకర్త కోలా రవీంద్ర ముదిరాజ్ తన ఇంట్లో 20 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన నూతనంగా కంకర ఇసుకతో పునః నిర్మాణం చేసి ఆదర్శనంగా నిలిచారు.. ఈ సందర్భంగా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ నగరం అంతా సీసీ రోడ్ల మయం వర్షం పడితే భూమిలోకి నీరు పోయే పరిస్థితి లేదని, కావున ఉన్న చెరువులు కొన్ని మాత్రమైనా వున్నా చెరువులలో ప్లాస్టిక్ చేరి వర్షపు నీరు ఇంకాకుండా గిన్నెలా ఉన్నా చెరువులలో ఉన్న పూడికను తొలగించి లోతు చేసినట్లయితే భూగర్భ జలాలు పెరుగుతాయని, అలాగే ఇళ్ల రిజిస్ట్రేషన్, ప్లాట్ల రిజిస్ట్రేషన్ ఇంకుడు గుంతలు ఉంటేనే చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులను సవరించాలని నూతనంగా ప్లాటింగ్ చేసేవారు తప్పనిసరిగా ఇంకుడు గుంత ఉంటేనే లేఅవుట్లకు హెచ్ఎండిఏ అనుమతి ఇవ్వాలని ఆయన అన్నారు.


**సామజిక బాధ్యతగా ఇంకుడు గుంతలు నిర్మాణచేయాలి** ఇంకుడు గుంతల నిర్మాణ కార్యక్రమాన్ని వ్యక్తి గతంగానే కాకుండా సామాజిక పరంగా కూడా భారీ ఎత్తున చేపట్ట గలిగితే సరైన ప్రతి ఫలము పొందగలరని, వర్షపునీటిని వృధాగా పోనీయకుండా ఎక్కడికక్కడ ఆ జలాలను ఇంకుడు గుంతల లోనికి చేర్చగలిగితే భూగర్భ జల మట్టం పెరగడానికి ఎంతగానో దోహదపడతాయని రవీందర్ ముదిరాజ్ అన్నారు. ఆరుబయట, ఇళ్ల ప్రహరీ లోపల, బోర్ల చుట్టు పక్కల ఇంకుడు గుంతల నిర్మాణం చేపడితే భూగర్భ జలం పెరుగుతుందని. ఏటేటా తగ్గిపోతున్న భూగర్భ జలమట్టం వృద్ధికి ఇంకుడు గుంతలే శరణ్యమని. వీటి నిర్మాణానికి చాలా తక్కువ ఖర్చు అవుతుంది కాబట్టి వీటిని నిర్మించి వృథా నీటిని వాటిలోకి పంపించడం ద్వారా ఆ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పెంపొందించుకోవచ్చని. ఇంకుడు గుంటలు నిర్మించినందున ఆ చుట్టు ప్రక్కల పడిన వృధాగా పోయే వర్షపు నీరు ఆ గుంటలో చేరి భూగర్భ జల మట్టము పెరిగి ఇదివరకు ఎండిపోయిన గొట్టపు బావులు తిరిగి జలసిరితో నిండిన సందర్బాలు అనేకం ఉన్నాయని రవీందర్ ముదిరాజ్ తెలిపారు.

# ఆవేర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**హైదరాబాద్: మే 13 (వార్తాప్రభ) :** మహేశ్వరం నియోజకవర్గం నాదర్ గుల్ రూట్స్ ప్లే స్కూల్ లో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం లో పాల్గొన్న న్యాయ సలహాదారు పీవీ క్రాంతి కిరణ్, వంశీ శాస్త్రి, అనిల్ కుమార్ ,దేవి మాట్లాడుతూ ఆవేర్ సంస్థ వారు185 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కామినేని హాస్పిటల్ వైద్యులు డా. చినంగారి ఆకాంక్ష డా. చిలుకూరి వైష్ణవి 185 మందికి వైద్యం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేనేజర్ దేవేందర్ ,అవేర్ సంస్థ కార్య నిర్వహణాధికారి వెంకన్న మరియు నాదర్గుల్ ప్రజలు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ 2025 సందర్భంగా జిల్లా ఎస్పీ యం. రాజేశ్ చంద్ర భద్రత ఏర్పాట్లు పరిశీలన




**కామారెడ్డి, మే 13 (వార్తాప్రభ)** పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ 2025 సందర్భంగా, జిల్లా ఎస్పీ యం. రాజేశ్ చంద్ర, ఐపిఎస్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలోని పరీక్ష కేంద్రాలను సందర్శించారు. భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు.

# 18న మెగా జాబ్ మేళా!!

- సింగరేణి ఆధ్వర్యంలో.. 100 కంపెనీలు... 4వేల ఉద్యోగాలు
- ఫస్ట్ జాబ్ టర్న్స్ బెస్ట్ కెరియర్
- నిరాశ చెందకు టాలెంట్ నిరూపించుకో జాబ్ కొట్టు
- సింగరేణి ఆర్జీవన్ జీఎం లలిత్ కుమార్




**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 13 (వార్తాప్రభ ప్రతినిధి)**ఈనెల 18న(ఆదివారం రోజు) నోబుల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్మెంట్ సొసైటీ సౌజన్యంతో సింగరేణిలో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా నిరుద్యోగ యువత కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని ఆర్జీవన్ జీఎం లలిత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మీడియా సమావేశంలో జాబ్ మేళా సంబంధిత అంశాలను క్లుప్తంగా వెల్లడించారు. సింగరేణి ఆధ్వర్యంలో.. 100 కంపెనీలు... 4వేల ఉద్యోగాలు లక్ష్యంగా మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫస్ట్ జాబ్ టర్న్స్ బెస్ట్ కెరియర్ అని స్ఫూర్తి మాటలు అన్నారు. నిరాశ చెందకు టాలెంట్ నిరూపించుకో జాబ్ కొట్టు అని ప్రోత్సాహక మాటలను తెలిపారు. ప్రభుత్వ ప్రతినిధులు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ జాబ్ మేళా ఏర్పాటుకు విశిష్ట కృషి చేశారని చెప్పారు. ఆసక్తిగల యువత సదవకాశాన్ని వినియోగించుకొని సంబంధిత హెల్ప్ డెస్క్ నెంబర్ 9491144252లో మరిన్ని వివరాల కోసం సంప్రదించాలని, ఉదయం ఎనిమిది గంటలకు జాబ్ మేళా ప్రారంభించబడుతుందని, 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల వరకు గల యువత అప్లై చేసుకోవచ్చని, జీతం సుమారు 15వేల రూపాయల నుంచి 35 వేల వరకు అందజేసే కంపెనీలు జాబ్ ఆఫర్ ఇస్తున్నాయని వివరించారు. బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్, ఇన్సూరెన్స్, ఐటీ రిలేటెడ్, మార్కెటింగ్, సెక్యూరిటీ, సేల్స్ విభాగాలలో జాబ్ ఆఫర్స్ ఉన్నట్లు ప్రకటించారు.

# ప్రణాళిక బద్ధంగా గచ్చిబౌలి డివిజన్ అభివృద్ధి.

## కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



**శేరిలింగంపల్లి,మే 12 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ నానక్ రామ్ గుడా లో రూ 68.00 లక్షలతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కాలనీ వాసులు మరియు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి.ఈ సందర్భంగా గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ సీసీ రోడ్ నిర్మాణ పనుల్లో నాణ్యతా విషయంలో ఎక్కడా కూడా రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలను పాటించే విధంగా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని అదేవిధంగా రాబోవు కాలంలో కాలనీ వాసులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెవెల్స్ సరి చూసుకుంటూ వీలైనంత త్వరగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు వారు సూచించారు.గచ్చిబౌలి డివిజన్ లో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.అదేవిధంగా భవిష్యత్తులో కూడా మరిన్ని పనులు చేపట్టి కాలనీలలో మౌనిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు.గచ్చిబౌలి డివిజన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.ప్రజలకు మేలైన మౌలిక వసతుల కల్పనకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని తెలియజేశారు.అదేవిధంగా కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా వారి సహాయ సహకారాలు ఉంటాయని కాలనీ వాసులకు తెలపటం జరిగింది.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ రషీద్,గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు శివ సింగ్,సీనియర్ నాయకులు కైలాష్ సింగ్,సుమన్,శ్రీకాంత్ రెడ్డి,బాబ్లీ సింగ్,గోపాల్,గణేష్ సింగ్,రంజిత్ సింగ్,విశాల్,విక్కీ, శంకేష్,శ్రీను,వర్క్ ఇన్స్పెక్టర్ భిక్షపతి,నానక్ రామ్ గుడా వాసులు,స్థానిక నేతలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిక్ నగర్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

## అభినందించిన శాసనసభ్యులు అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి,మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కొండాపూర్ డివిజన్ పరిధిలోని సిద్దిక్ నగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కు నూతనంగా ఎన్నుకోబడిన కాలనీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు పి.ఎ.సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగినది.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను శాలవతో సన్మానించి, పి.ఎ.సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అభినందించారు.ఈ సందర్భంగా పి.ఎ.సి ఛైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ సిద్దిక్ నగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కు నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియచేయడం జరిగినది.అదేవిధంగా సిద్దిక్ నగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ వాసులు కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని,కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని,కాలనీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయి అని,ఏ చిన్న సమస్య ఐన తన దృష్టికి గాని తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని ,నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులు కాలనీ వాసులందరికి ఎల్లవేళాలో అందుబాటులో ఉంటూ కాలనీ సమస్యల పై స్పందిస్తూ,ప్రతి ఒక్కరు సమిష్టిగా కలిసి కాలనీ అభివృద్ధి కి పాటుపడాలని ఒక ఆదర్శవంతమైన కాలనీ గా తీర్చిదిద్దే క్రమం లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పి.ఎ.సి చైర్మన్ గాంధీ తెలియచేసారు.సిద్దిక్ నగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ లో అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని,అసంపూర్తిగా మిగిలిపోయిన పెండింగ్ పనులు త్వరలోనే పూర్తి చేస్తానని,మౌలిక వసతుల కల్పనకై పెద్ద పీట వేస్తానని,కాలనీ అసోసియేషన్ భాగస్వామ్యం తో అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని పి.ఎ.సి చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమంలో సిద్దిక్ నగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తిరుపతి రెడ్డి,జనరల్ సెక్రెటరీ రవీందర్ రెడ్డి,ట్రెజరర్ విష్ణు వర్ధన్ రెడ్డి మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వరద నీరు పోవడానికి వాటర్ వెంట్ ఏర్పాటు చేయండి





**మల్కాజిగిరి : మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్ లోని మిర్జాలగూడ చిన్మయి మార్క్ , వెంకటాద్రి నగర్ లలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. మల్కాజ్ గిరి నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మిర్జాలగూడ చిన్మయి మార్క్ లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మల్కాజ్గిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి గారు. ఈ సందర్భంగా వరద ముంపు గురవుతున్న చిన్మయ మార్గంలో వరద నీరు సజావుగా పోవడానికి వాటర్ వెంట్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే చిన్మయి మార్గంలో ఉన్న 277 గజాల పార్కు స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం వెంకటాద్రి నగర్ లో పర్యటించి స్థానికంగా నెలకొన్న రోడ్డు, భూగర్భ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. హనుమాన్ పేట్ లోనీ రైల్వే లైన్ కింది నుండి కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (వెంట్) ను ఎమ్మెల్యే గారు పరిశీలించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుండి మరో డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి ఏసిపి శ్రీనివాస్, డి ఈ లౌక్య, ఏఈ దివ్య జ్యోతి, నాయకులు జేఏసీ వెంకన్న, మేకల రాము యాదవ్, బీ ఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారుమల్కాజ్గిరి నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మిర్జాలగూడ చిన్మయి మార్క్ లో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ తో కలిసి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరద ముంపు గురవుతున్న చిన్మయ మార్గంలో వరద నీరు సజావుగా పోవడానికి వాటర్ వెంట్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే చిన్మయి మార్గంలో ఉన్న 277 గజాల పార్కు స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం వెంకటాద్రి నగర్ లో పర్యటించి స్థానికంగా నెలకొన్న రోడ్డు, భూగర్భ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. హనుమాన్ పేట్ లోనీ రైల్వే లైన్ కింది నుండి కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (వెంట్) ను ఎమ్మెల్యే గారు పరిశీలించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుండి మరో డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి ఏసిపి శ్రీనివాస్, డి ఈ లౌక్య, ఏఈ దివ్య జ్యోతి, నాయకులు జేఏసీ వెంకన్న, మేకల రాము యాదవ్, బీ ఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

# గౌతమ బుద్ధుని బోధనలు ప్రపంచానికి ఆదర్శం!!

- విశ్వ మానవాళికి ప్రేమ తత్వాన్ని పంచిన యోధుడు
- లాయర్ జూపాక వెంకటేశ్



**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 13 (వార్తాప్రభ ప్రతినిధి)** ప్రపంచ మానవాళికి చక్కటి జీవన విధానాన్ని అందించిన గౌతమ బుద్ధుడు గొప్ప దార్శనీయకుడని, ఆయన చూపిన మార్గం ఆచరణీయమని లాయర్ జూపాక వెంకట్ అన్నారు. ఈ మేరకు మంగళవారం గౌతమ బుద్ధుడి 2570వ జయంతి సందర్భంగా గోదావరిఖని మనో చైతన్యలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ....నేడు అశాంతి మయ ప్రపంచంలో మనుషులు శాంతి కోసం పరితపిస్తున్నారు అని శాంతిని వెతికే ప్రతి మనిషి బుద్ధుని మార్గానికి రాక తప్పదన్నారు. మనుషులు మధ్య ఉన్న అసమానతులను తొలగించి, సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని కోరుతూ, చల్లని చిరునవ్వుతో బుద్ధుడు పరితపించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెరిక మనోహర్, పులిపాక ప్రవీణ్, రవి, సంతోష్, శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఈటెలకు జగ్గా రెడ్డి క్షమాపణలు చెప్పాలి

## జాతీయ సంగీత కళాకారుల సంఘం అధ్యక్షులు చెన్నారావు




**మల్కాజిగిరి :మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బీసీ నేత, మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ పై కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎ మ్మెల్యే జగ్గా రెడ్డి చేసిన వ్యాఖ్యలు వెంటనే ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని జాతీయ సంగీత కళాకారుల సంఘం అధ్యక్షులు చెన్నారావు డిమాండ్ చేశారు. 4 కోట్ల మంది ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుని ఏడు సా ర్లు శాసన సభ్యునిగా ఎన్నికైన ఈటెల పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఆయన హితవు పలికారు. జగ్గా రెడ్డి క్షమాపణలు చెప్పని పక్షంలో తమ వాయిద్య కళాకారులతో 24 గంటల పాటు వాయిద్యాలు వాయిస్తామని హెచ్చరించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధి పై ఇలాంటి పదజాలం వాడడం తగదని జాతీయ సంగీత కళాకారుల సంఘం అధ్యక్షులు చెన్నారావు అన్నారు. మంగళవారం మల్కాజిగిరి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక , వైద్య ఆరోగ్య శాఖా మంత్రిగా ఆయన తెలంగాణ ప్రజలకు ఎన్నో మేలు చేసే కార్యక్రమాలు చేశారని చెప్పారు. ఇలాంటి వ్యాఖ్యల ద్వారా భావి తరాలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారో వారే తెలుసుకోవాలని హితవు పలికారు.

# పేదోడి సొంత ఇంటి కలను నెరవేరిన వేళ

**కామారెడ్డి, మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గం గత 20 సంవత్సరాల నుండి ఎల్లారెడ్డి నియోజకవర్గ పేదలు సొంత ఇంటి కల కలగనే మిగిలిపోయింది. గత ప్రభుత్వ పాలకుల అసమర్థ పాలన వల్ల ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా నిర్మించలేదు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల వ్యవధిలోనే నియోజకవర్గానికి 3500 డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు అయ్యాయి. అందులో భాగంగా ఈరోజు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని 7వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పది మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్, పేదల ఇంటి కలను సాకారం చేసే దిశగా ముందడుగు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ మాట్లాడుతూ ప్రజలకు సొంత ఇంటి ఉండడం ఒక కల. ప్రజలు అందరు తమకు సొంత ఇల్లు ఉండాలని కోరుకుంటారు. ఈరోజు 10 మంది లబ్ధిదారులకు సొంత ఇంటి నిర్మాణం కొరకు భూమి పూజ చేసినందుకు మంజురు పత్రాలను అందించినందుకు చాల సంతోషంగా ఉంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు, ఎల్లారెడ్డి మండల అధ్యక్షులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానా, జైలు తప్పదు-ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్

**జగిత్యాల, మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి):**మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానా తోపాటు జైలు తప్పదని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ ఆన్నారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్.ఐ మల్లేష్ తమ సిబ్బందితో కలిసి సోమవారం రాత్రి పట్టణంలోని గోవింద పల్లె చౌరస్తాలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న సమయంలో ఛత్తీస్గఢ్రాష్ట్రానికి చెందినబసంత్ ఠాకూర్ (29) అను వ్యక్తి 550 ఎంజీ/100 ఎంఎల్ ఆల్కహాల్ స్థాయి ద్వారా పట్టుబడగా ,అతని పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ జి. కరుణాకర్ ముందు హాజరుపరుచాగ అతనికి నాలుగు రోజులు జైలు శిక్ష విధించారు. ఈసందర్భంగాట్రాఫిక్ ఎస్.ఐ మల్లేష్ మాట్లాడుతూ.. మద్యం

# ఎడిటోరియల్

## ట్రంప్ 'కశ్మీర్' ఆశకు తలుపులు మూసేసిన మోడీ

పహల్గాం ఉగ్రదాడి.. దానికి కౌంటర్ గా ఆపరేషన్ సిందూర్.. అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కొత్త మార్పులు చోటు చేసుకున్నాయి. ఇప్పటివరకు పాకిస్తాన్ నోటి నుంచి వచ్చే కశ్మీర్ మాటకు బదులుగా భారత ప్రధాని నరేంద్ర మోడీ నోటి నుంచి పాక్ ఆక్రమిత కశ్మీర్ అనే పదం బలంగా బయటకు రావటమే కాదు.. ఆ దేశంతో రెండు విషయాల మీద మాత్రమే చర్చలు జరుపుతామని.. అందులో మొదటిది ఉగ్రవాదం.. రెండోది.. పాక్ అక్రమిత కశ్మీర్ అని స్పష్టంగా తేల్చేశారు.దీంతో.. కశ్మీర్ అంశం గురించి మాట్లాడటానికి ఏమీ లేదన్న సందేశాన్ని ఇవ్వటమే కాదు.. దాని ప్రస్తావన చేయటాన్ని కూడా తాము అంగీకరించమన్న విషయాన్ని ప్రపంచ దేశాలకు సూటిగా చెప్పేశారు. కశ్మీర్ ప్రస్తావన తేవటం భారత్ కు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదన్న విషయాన్ని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు మిగిలిన వారి కంటే ఎక్కువగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు ఆశనిపాతంలా మారాయని చెప్పొచ్చు. ఎందుకంటే.. భారత్ – పాక్ మధ్య మధ్యవర్తిత్వం చేయాలని ట్రంప్ ఎంతలా తపిస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆ ఇష్టాన్ని ఆయన దాచుకోలేదు కూడా. అవకాశం వచ్చిన ప్రతి సందర్భంలోనూ ఆయన ప్రస్తావిస్తూనే ఉన్నారు.భారత్.. పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గటంలో తానే కీలకభూమిక పోషించానని.. అణుయుద్ధాన్ని ఆపానని.. రెండు దేశాలు తాను చెప్పినట్లు వినకుంటే వాణిజ్యాన్ని ఆపేస్తానని చెప్పినట్లుగా ట్రంప్ స్వయంగా చెప్పుకున్నారు. ఆయన మాటల్ని చూసినప్పుడు అర్థమయ్యేది ఒక్కటే. సాధారణంగా రెండు దేశాలకు సంబంధించి మరో దేశం మాట్లాడేటప్పుడు.. అందునా భారత్ లాంటి పెద్ద దేశం గురించి వ్యాఖ్యలు చేసే వేళలో.. తాను కాస్తంత జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాన్ని ట్రంప్ పట్టించుకోలేదు.ట్రంప్ మాదిరి మాటల్ని విసిరేసే విధానాన్ని భారత పాలకులకు మొదట్నించి అలవాటు లేదు. ఎవరైనా తొందరపాటుతో మాట్లాడితే కాస్త ఓపికతో.. సహనంతో చూసే తీరు మొదట్నించి ఉంది. ఇదే.. ట్రంప్ నకు శ్రీరామరక్షగా మారింది. అయితే..ఇక్కడ నరేంద్ర మోడీ గురించి కూడా చెప్పాలి. భారత్ – పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ట్రంప్ వ్యవహరించిన తీరు.. ఆయన పెట్టిన పోస్టుల కారణంగా మోడీ ఇమేజ్ ఎంతలా దెబ్బ తీసిందో తెలిసిందే. ఒక విధంగా చెప్పాలంటే.. అనూహ్య రీతిలో బయటకు రాలేని బంధనంలో మోడీ చిక్కుకుపోయినట్లుగా పరిస్థితి కనిపించింది.ఇలాంటి వేళలో.. జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగాన్ని ఒక అవకాశంగా మలుచుకున్న మోడీ.. తన భావాన్ని.. అభిప్రాయాన్ని బలంగా.. సూటిగా చెప్పేశారు. పాకిస్తాన్ తో చర్చలు అంటే.. ఏదేదో అనుకునేరు. కేవలం రెండు అంశాల్లోనే ఆ దేశంతో చర్చలు జరుపుతామని చెప్పి.. అందరిని ఆశ్చర్యానికి గురి చేశారు.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం రెండు దేశాల మీద మధ్యవర్తిత్వం చేయాలంటే అయితే ఉగ్రవాదం అంతం మీదా.. రెండోది పాక్ అక్రమిత కశ్మీర్ మీదా.ఈ రెండు విషయాల్ని టచ్ చేసే కన్నా.. తన వ్యాపారాన్ని తాను చేసుకోవటానికే ట్రంప్ మొగ్గు చూపుతారు. తన చిన్నపాటి ప్రసంగంతో మోడీ చాలానే చేశారు. అన్నింటికి మించి ట్రంప్ 'కశ్మీర్'కలను కూల్చేయటమే కాదు..మరెప్పటికి మాట్లాడలేని పరిస్థితికి తీసుకొచ్చారు. ఒకవేళ తెగించి మరీ.. కశ్మీర్ అంశాన్ని ప్రస్తావిస్తే? అన్న సందేహం రావొచ్చు, అలాంటిదే జరిగితే.. తమకు ఆ విషయంలో ఎలాంటి ఆసక్తి ఉండదన్న విషయాన్ని మోడీ కుండబద్ధలు కొట్టేశారు. ఇక.. ట్రంప్ మాత్రం ఏం చేయగలరు?

### ఎమ్మెల్యే సుజనా చౌదరిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్



**విజయవాడ పశ్చిమ మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు సుజనా చౌదరి ను మంగళవారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు శాసనమండలి మాజీ సభ్యులు యలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్ , టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్ కూటమినేతలతో కలిసి పరామర్శించారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఇటీవల గాయపడగా కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు.మంగళవారం హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి, యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారి వెంట టీడీపీ నేతలు సారిపల్లి రాధాకృష్ణ, అజీజ్ తదితరులు ఉన్నారు.

## క్షమాగుణం శ్రేష్ఠం



అందరికీ ఉండదు
క్షమించే హృదయం
అదే గనుక ఉంటే
శత్రుత్వం మాయం
ఐక్యతకు రహదారి
క్షమాగుణం శ్రేష్ఠం
తెలుసుకొనుము చదువరి
ప్రతీకారం నష్టం
ప్రేమించే తత్వం
జయించే ఆయుధం
వసుధైక కుటుంబం
అవుటకదే మార్గం
విశాల దృక్పథం
అలవర్చుకుంటేనే
జీవితాన లాభం
లేదంటే కష్టం

**గద్వాల సోమన్న,**
సెల్:9866414580

# జాతీయ ఉపాధి హామీ పథకం లో నిధులు గోలమాల్

● 2007 నుండి నేటివరకు సుమారు రూ 40 లక్షలు ఆర్థిక దోపిడీ ● అధికారుల వాటా ఎంత....మస్తరు కూలీల వాటా ఎంత.....? ● అర్హత లేని వృద్ధులు....ఇతర జిల్లాల్లో చదువుతున్న విద్యార్థులకూ మస్తరు ● పనిలో లేకున్నా కుటుంభ సభ్యులు, బంధువులకు మస్తరు

**చెరుకుపల్లి మండలం మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పిల్లి గుడ్డిదైతే ఎలుక వెక్కిరించిందనే చందంగా అధికారులు ధన దాహనం ఎక్కువైన కొద్దీ కింది స్థాయి సిబ్బంది ఆర్థిక దోపిడీ కి అడ్డుఅదుపు లేకుండా పోతుంది.సరిగ్గా అలాంటి దోపిడీ బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గ పరిధిలోని చెరుకుపల్లి మండలం ఆరుంబాక గ్రామ పంచాయతీ పరిధిలో చోటుచేసుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం చెరుకుపల్లి మండలం ఆరుంబాక పంచాయతీ లో జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఒకరు అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కిన సంఘటన వెలుగులోకి వచ్చింది. తనకు అనుకూలురైన తమ సమీప బంధువులు, ఇంకా కొంతమంది ని సమకూర్చుకొని జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు దారి మళ్ళించిన ఫీల్డ్ అసిస్టెంట్ ఓ అడుగులు ముందుకు వేసింది. నిబంధనలకు తిలోదకాలు ఇచ్చిన ఆ ఘనురాలు పొరుగు జిల్లాల్లో చదువు తున్న తన పిల్లలైన కొడుకు, కూతురు పేర్లను ఉపాధి హామీ పథకం లో చేర్చి నిధులు దారి మళ్ళించినట్టు పక్కా రికార్డులున్నాయి. అంతే గాకుండా అంగ వైకల్యం గల సుమారు 80 సంవత్సరాల వయస్సు దాటిన తన ఇంట్లో మనిషికి మస్తరు వేయడం వింతగా ఉందని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ సొంత నియోజకవర్గంలో ఇలా జరగడంతో తెదేపా నాయకులే తలలు పెట్టుకొంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ హోదాలోనే ఇంతటి విచ్చలవిడిగా అవినీతి జరుగుతున్నా పై స్థాయి అధికారులు నిద్ర నటించడం పలు అనుమానాలకు తావిస్తోంది. నీకూ నాకూ చెరిసగం అంటూ కొంతమంది పనిలో లేకున్నా 2007 లో తయారు చేసిన జాబితా ప్రకారం అందరికీ హాజరు పడుతుందని ఇలాంటి ఆరోపణల్లో నిజా. నిజాలు తేల్చుడాని జాతీయ ఉపాధి హామీ పథకం వివరాల చిట్టాను చూపించాలని తాను అడిగినా...... ఆ ఫైల్ తనకు పీల్డ్ అసిస్టెంట్ చూపించడంలేదని ఆరుంబాక గ్రామ పంచాయతీ సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు తెలిపారు. తనకు ఫైల్ అందించకుంటే సమాచార హక్కు చట్టం ప్రకారం తాను ఆ ఫైల్ తెప్పించు కొంటానని కోటేశ్వరరావు అన్నారు. బాపట్ల జిల్లా స్థాయి అధికారులు రంగంలో దిగి నిజానిజాలు నిగ్గు తేల్చాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

# శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీరు.

రిజర్వాయర్ల నిర్మాణాలు ఇంకా పెంచాలి...



**మచిలీపట్నం మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం నగరంలోని ప్రజలకు తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటిని పుష్కలంగా అధికారులు అందిస్తున్నారు. వేసవికి ముందే ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల ఇది సాధ్యపడిందని చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న నీరు 62 రోజులకు సరిపడా ఉందని చెబుతున్నారు. ఈ లోపల వర్షాలు కూడా కురుస్తాయి గనుక తరకటూరు సమ్మర్ స్టోరేజీ పంపుల చెరువుల్లో నీటిని నిల్వ ఉంచుతామని అధికారులు వివరించారు. నగరంలో ఉన్న 50 డివిజన్ల లోని శివారు ప్రాంతాలకు 15 ట్యాంకర్ల ద్వారా రోజు విడిచి రోజు మంచినీటిని అందిస్తున్నారు. నగరానికి సొంతంగా 7 ట్యాంకర్లు ఉండగా, 8 ట్యాంకర్లను అద్దెకు తీసుకొచ్చి తిప్పుతున్నారు. ఈ వేసవిని దృష్టిలో పెట్టుకుని అదనంగా మరో 3 ట్యాంకర్లను తిప్పుతున్నామన్నారు. ప్రస్తుతానికి 15 ట్యాంకర్లు రోజుకు 105 ట్రిప్పులు తిరుగుతూ నగరంలో తాగునీటిని ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందించగలుగుతున్నామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం తరకటూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో 3300 మిలియన్ల లీటర్ల నీరు నిల్వ ఉన్నది. ఈ నీరు 50 రోజుల వరకు వస్తుంది. పంపుల చెరువులో 13 అడుగులలోతున నీరు నిల్వ ఉండగా 12 రోజులు వస్తుంది. మొత్తం 62 రోజులకు ఈ త్రాగునీరు ప్రజల అవసరాలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. ఇక నగరంలో 19 మంచినీటి రిజర్వాయర్లు ఉండగా వీటిలో 15320 కిలో లీటర్ల నిల్వ సామర్థ్యం ఉంది. నగరంలో రోజుకు మంచినీటిని 22 మిలియన్ల లీటర్ల మంచినీటిని సరఫరా చేస్తున్నారు. దాదాపు రెండు లక్షల జనాభాకు మంచినీటిని అందిస్తున్నారు. నగరంలో మొత్తం ఇప్పటివరకు 41173 ఇల్లు ఉన్నాయి. ఇప్పుడు అనేక ఇల్లు నిర్మాణాల్లో ఉన్నాయి. ఇళ్లకు మంచినీటి కుళాయిలు, పబ్లిక్ టాపులు 33 వేలకు పైగా ఉన్నాయి. 590 చేతిపంపులు ఏర్పాటు చేశారు. రోజు విడిచి రోజు ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు అనగా ఒక గంట మాత్రమే కులాయిల ద్వారా మంచినీటిని విడుదల చేస్తున్నారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నారు. దీనివల్ల మోటర్లు ఉన్నవారికి నీటి సరఫరా జరక్కుండా ఉంటుంది. ప్రజలందరికీ ఆ గంట పాటు మంచినీటి సరఫరా ఉంటుంది. నగరంలో ఉన్న 19 రిజర్వాయర్లలో హెడ్ క్వాటర్ వాటర్ వర్క్స్ లో రెండు ఉన్నాయి. ఈ రిజర్వాయర్ లో 1750, 1250 కిలో లీటర్ల సామర్థ్యం గలవి ఉన్నాయి. ట్రావెల్స్ బంగ్లా ఆవరణలో 1250, 455 కిలో లీటర్ల సామర్థ్యం గలవి రెండు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయ సమీపంలో రెండు, రాజుపేట లో రెండు, శారద నగర్, సర్కారు తోట, చిలకలపూడి, వలదం పాలెం, భాస్కరపురం, మందుల గూడెం, గిలకలదిండి, రుస్తుం బాధ, గడ్డి బజారు, ఓగీసు పేట, మాచవరంలలో ఒక్కోటి చొప్పున రిజర్వాయర్లు ఉన్నాయి. ఈ రిజర్వాయర్లలో 1250 కిలోమీటర్ల సామర్థ్యం కలవి మూడు, 1000, 800, 700, 600, 500, 455 కిలో లీటర్ల సామర్థ్యం గలవి ఉన్నాయి. పోర్టు నిర్మాణం జరిగి వినియోగంలోకి రాగానే రిజర్వాయర్ల సంఖ్యను గణనీయంగా పెంచవలసి ఉంటుంది. ఇప్పటినుంచే వాటి నిర్మాణాలు చేపట్టడానికి ప్రతిపాదనలు చేయాలి.

### లేబర్ కోడ్స్ రద్దు చేయాలి, కనీస వేతనం 26,000 సాధనకై

# ఈనెల 20 తేదీ జరుగు సమ్మె జయప్రదం చేయండి....

● రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు
● సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్



**రెడ్డిగూడెం మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి):**దేశవ్యాప్తంగా ఈనెల 20వ తేదీ జరుగు జాతీయ సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ రెడ్డిగూడెం మండలం, రెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో నేడు ప్రజాసంఘాల నాయకులతో కలసి కరపత్రాలు విడుదల చేశారు, ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ సుధాకర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది అన్నారు,కార్మికులను కట్టు బానిసలుగా మార్చే విధంగా లేబర్ కోడ్స్ తీసుకు వచ్చిందని దీంతో కార్మికుల హక్కులు పూర్తిగా కాలరాయపడతాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు, తక్షణమే నాలుగు లేబర్ కోడ్స్ రద్దుచేసి, 44 కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం 26,000 అమలు చేయాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర (ఎం ఎస్ పి) అమలు చేయాలని, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించి, కూలి 600 రూపాయలు అమలు చేయాలని, రవాణా రంగ కార్మికులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు తక్షణమే పునర్ ప్రారంభించి పెండింగ్ క్లైములు ఇవ్వాలని, సంక్షేమ బోర్డు నుంచి దుర్వినియోగమైన నిధులను భవన నిర్మాణ కార్మికులకు ఖర్చుపెట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు, స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మద్ది రెడ్డి మాధవరెడ్డి, ఉయ్యూరు కృష్ణారెడ్డి, సిఐటియు రెడ్డిగూడెం మండల కమిటీ సభ్యులు రామారావు, రజిని, వాణి, కౌలు రైతు సంఘం డి వీరస్వామి, జి అప్పిరెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలు గుర్తింపు కు స్పెషల్ డ్రైవ్ ప్రారంభం



**జగ్గయ్యపేట, మే 13 (వార్తప్రభ)** సమగ్ర శిక్ష ఎన్రోల్మెంట్ డ్రైవ్ 2025-26 లో భాగంగా జగ్గయ్యపేట మండలంలోని గండ్రాయి లో 0 -18 సంవత్సరాల వయసు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లల ను గుర్తింపు ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. సహిత విద్య వనరుల ఉపాధ్యా యులు డి. ఉదయలక్ష్మి, జానకీలు జగ్గయ్యపేట మండలం గండ్రాయి గ్రామంలో ప్రత్యేక అవసరాలు కలిగిన (దివ్యాంగ) పిల్లల పాఠశాలలో నమోదు చేపట్టారు. ఈ సర్వే జూన్ 9 వరకు జరుగుతుంది. ఈ సర్వే ద్వారా వినికిడి లోపం, మాటలు రాకపోవడం, అంధత్వం,బుద్ధిమాంద్యత, ఆటిజం వంటి 21 రకాల వైకల్యాలు గల పిల్లలను గుర్తించి భవితా సెంటర్ లో లేదా పాఠశాలలో చేర్పిస్తున్నారు. భవిత సెంటర్ల ద్వారా అందజేస్తున్న స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, వ్యక్తిత్వ వికాసం వంటి శిక్షణలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాలకు రాలేని తీవ్ర వైకల్యం గల పిల్లలకు ప్రతి శనివారం ఇంటి వద్ద శిక్షణ అందిస్తున్నట్లు తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు. సమగ్ర శిక్ష ద్వారా నడుపబడుతున్న ఈ భవిత కేంద్రాలలో విద్యనభ్యసించే పిల్లలకు పలు అలవెన్సు లు, సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందచేస్తోంది. వైకల్యాన్ని అధిగమించే నిమిత్తం అవసరమైన ఉపకరణాలు బోధన అభ్యసన సామాగ్రిని అసెస్మెంట్ క్యాంపుల నిర్వహణ ద్వారా అందజే స్తున్నారు. అంగన్వాడీ, ఏ.ఎన్.ఎం, ఆశ, సచివాలయ సిబ్బంది సాయంతో ఇంటింటికి సర్వేను నిర్వహిస్తున్నారు.

## నాటు తుపాకీ మందు పేలి ముగ్గురికి తీవ్ర గాయాలు.



**కైకలూరు మే 13 (వార్తా ప్రభ)** ఏలూరు జిల్లా, కైకలూరు నియోజ కవర ం,కైకలూరు మం డలం ,రామవరం గ్రామంలో నాటు తుపాకీ మందు పేలి ముగ్గురు పక్షుల వేటగాళ్లకు తీవ్ర గాయా లయ్యాయి. తమిళనాడు నుండి వలస వచ్చి కైకలూరు నియోజకవర్గం లోని పలు గ్రామాల్లో నివాసం ఉంటూ, చేపల చెరువులు మరియు రొయ్యల చెరువులోని చేప పిల్లలు, రొయ్యలను పక్షులు తినకుండా, నాటు తుపాకులతో గస్తీ కాస్తూ జీవనం సాగించే,తమిళనాడు నుంచి వలస వచ్చిన పక్షుల వేటగాళ్లు నాటు తుపాకీ మందు తయారు చేస్తుండగా ఈ మందు పక్కన దోమల నివారణ జెట్ ఉండడం వలన నాటు తుపాకీ మందు పేలి ముగ్గురికి చరణ్, సతీష్, మణి అనే ముగ్గురు పక్షుల వేటగాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి.భారీ శబ్దానికి స్థానికులు రామవరం గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే క్షతగాత్రులను హుటా హుటిన స్థానికులు మరియు కైకలూరు రూరల్ ఎస్సై రాంబాబు,ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఇద్దరని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఒకరిని కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కైకలూరు రూరల్ ఎస్సై రాంబాబు కేసు నమోదు చేసి పేలుడుకు గల కారణాలను దర్యాప్తు చేస్తున్నారు.

### డిసిఎంఎస్ చైర్మన్ గా శ్యామల కాశిరెడ్డి నియామకం

## పట్ల హర్షం వ్యక్తం చేసిన బైరెడ్డి, దారపనేని



**కనిగిరి మే 13 వార్తా ప్రభ ప్రతినిధి** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్త, కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అడుగుజాడల్లో పయనిస్తూ, వెలిగండ్ల మండలంలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తూ, తెలుగుదేశం పార్టీ విధేయుడుగా ఉంటూ, ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మా మిత్రుడు, మంచికి మారుపేరు అయిన శ్యామల కాశి రెడ్డికి మన ప్రియతమ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆశీస్సులతో డిసిఎంఎస్ చైర్మన్ పదవి వరించడం శుభ పరిణామం అని కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ పదవి రావటానికి సహకరించిన కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డి, ప్రకాశం జిల్లా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోల బాల వీరాంజనేయ స్వామి, జిల్లాలోని శాసన సభ్యులందరికీ బైరెడ్డి, దారపనేని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ కు శుభాకాంక్షలు- వేముల దుర్గారావు

హర్షం వ్యక్తం చేసిన కృష్ణా జిల్లా వడ్డెరలు



**మచిలీపట్నం మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కూటమి ప్రభుత్వం నామినేట్ పదవుల జాబితాను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కు చెందిన మల్లెల ఈశ్వరరావును ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా పార్లమెంట్ వడ్డెర సాధికార సమితి అధ్యక్షుడు వేముల దుర్గారావు కార్పొరేషన్ చైర్మన్ మల్లెల ఈశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. వడ్డెర చైర్మన్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలానే కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు కృష్ణాజిల్లా వడ్డెర ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా వేముల దుర్గారావు మాట్లాడుతూ వడ్డెర సామాజిక వర్గ స్థితిగతులను కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వరరావు క్షుణ్ణంగా పరిశీలించి వడ్డెర సామాజిక వర్గ ప్రజల సంక్షేమంతో కూడిన అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. వడ్డెర ప్రజలు ఉన్న ప్రాంతాలను క్షేత్రస్థాయి లో పర్యటించి వారి సమస్యలను తెలుసుకొని ప్రభుత్వానికి నివేదించి పరిష్కరించాలని కోరారు.

## ఖేలో ఇండియా 2025 యూత్ గేమ్స్ లో ఆంధ్రప్రదేశ్ కు తృతీయ స్థానం

స్విమ్మర్ లను అభినందించిన విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ పశ్చిమ మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఖేలో ఇండియా 2025 యూత్ గేమ్స్ అండర్-18 కేటగిరీ లో ఆల్ ఇండియా ఛాంపియన్‌షిప్‌లో 64 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తృతీయ స్థానంలో నిలిచింది. ఈ విజయాన్ని సాధించడంలో కీలకపాత్ర పోషించిన అండర్-18 స్విమ్మర్లు తీర్థ సామదేవ్, దేవ గణేష్, యజ్ఞ సాయి విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ధ్యానచంద్రును కలిశారు. కమిషనర్ స్విమ్మర్లను అభినందిస్తూ, వారు రాష్ట్రానికి గర్వకారణమని ప్రశంసించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, స్విమ్మింగ్‌లో సాధించిన ఘనత రాష్ట్రం గర్వించదగ్గ విషయం అని, వారి ప్రతిభకు విజయవాడ నగరపాలక సంస్థ తరఫున మద్దతు ఉండే విధంగా అన్ని విధాలా సహకరిస్తారని, భవిష్యత్తులో వారు మరింత ప్రగతి సాధించాలని అని అన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అఫ్ స్పోర్ట్స్ డాక్టర్ లత, ఎన్టీఆర్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ ఐ. రమేష్, కృష్ణా జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ సెక్రటరీ వి. వినోద్, సహాయక కోచ్ నితీష్, ఇతర కోచ్‌లు పాల్గొన్నారు.

# మాజీ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) ఒక ఆర్థిక ఉగ్రవాది

● పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా ● విజయవాడ పార్లమెంట్ కార్యాలయంలో మీడియా సమావేశం ● అసూయకి పెటెంట్ తీసుకున్న వ్యక్తి కేశినేని నాని ● కేశినేని హోటల్స్ ప్రయివేటు లిమిటెడ్ పై అప్పు తెచ్చి బ్యాంకు కు లోన్ ఎగొట్టిన ఘనుడు కేశినేని నాని ● బ్యాంకు లకు డబ్బులు ఎగొట్టి, వాటిని షెల్ కంపెనీలకు మళ్లింపు ● హోటల్ డైరెక్టర్లను మార్చేసి, కూతుళ్ళ పేరుతో ఆంధ్ర క్యాంటీన్ పేరుతో నడుపుతున్నాడు ● కేశినేని నాని ఆర్థిక నేరాలపై సిబిఐ, ఈడీలతో ఉన్నతస్థాయి విచారణ జరగాలి ● అసూయ, ఆక్రోశం తో కేశినేని నాని తెలుగుదేశం పార్టీ పై నిందారోపణలు చేస్తున్నాడు. ● అహంకారం తో తల్లి, చెల్లి, స్నేహితులందరినీ దూరం చేసుకుని ఒంటరయ్యాడు ● త్వరలో గురుశిష్యులు ఇద్దరు జగన్, కేశినేని నాని జైలు వెళ్లటం ఖాయం

**విజయవాడ పశ్చిమ మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మాజీ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) బ్యాంకుల్ని మోసం చేయటంలో ఘనుడు. బ్యాంకుల దగ్గర లోన్స్ తీసుకుని వాటిని కట్టకుండా తప్పించుకోవటం ఎలానో తెలిసిన సిద్ధహస్తుడు. ఇటువంటి ఆర్థిక నేరస్తులను దృష్టిలో పెట్టుకుని సుప్రీం కోర్ట్ ఒక మాట చెప్పింది. ఆర్థిక నేరస్తుడు ఉగ్రవాదితో సమానం అని తెలిపింది.. విజయవాడలో ఆర్థిక ఉగ్రవాది మాజీ ఎంపి కేశినేని నాని అంటూ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా ఎంపి కేశినేని శివనాథ్ పై చేస్తున్న ఆరోపణలు ఖండిస్తూ , బ్యాంక్ లోన్ తీసుకుని కట్టకుండా ఎగొట్టి తిరుగుతున్న ఆర్థిక నేరస్తుడు మాజీ ఎంపి కేశినేని నాని పై విచారణ వేగవంతం చేయాలని కోరుతూ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో నాగుల్ మీరా మాట్లాడుతూ మాజీ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) తీరు గమనిస్తే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు , దొంగే దొంగతనం చేసి దొంగ దొంగ అరిచినట్లు ఒక అవినీతి పరుడు నీతిసూక్తులు చెప్పినట్లుగా కనబడుతుందని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యం, అవినీతి అంటూ సోషల్ మీడియా వేదికగా ఉపన్యాసాలు రాస్తున్న నాని కేశినేని హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పైన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ లో తీసుకున్న రూ.42 కోట్ల రూపాయల లోన్స్ కి సంబంధించి ఎంత ఎమౌంట్ కట్టావో దమ్ముంటే మీడియా ముందుకి వచ్చి సమాధానం చెప్పాలంటూ సవాల్ విసిరారు. కేశినేని హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ పైన తీసుకున్న లోన్ కి ఒక రూపాయి కూడా కట్టకుండా అది .ఎన్.పి.ఎ గా డైరెక్టర్లను మార్చి చూపించి బ్యాంక్ ను నాని మోసం చేస్తున్నాడని చెప్పారు. ఆ హోటల్ కి ఆంధ్రా క్యాంటీన్ పేరుతో రన్ చేస్తున్నాడని తెలిపారు. ఇప్పుడు రెస్టారెంట్ బాగా నడుస్తుంది. డబ్బులు విపరీతంగా వస్తూ వున్నాయి. కానీ నాని బ్యాంక్ దగ్గర తీసుకున్న లోన్ తిరిగి ఎందుకు చెల్లించటం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేశినేని నాని తన కూతుర్ల పేర్ల మీదే ఈ ఆంధ్రా క్యాంటీన్ పెట్టుకున్నాడన్నారు. నువ్వు బ్యాంక్ లో పెట్టిన లోన్ ఏమో ఎన్.పి.ఎ అయింది. నాని తన సిబ్బందిని హోటల్స్ డైరెక్టర్స్ గా తరుచూ మారుస్తూ అందర్ని మోసం చేస్తున్నాడన్నారు. ఆ డబ్బులను తన షెల్ కంపెనీలకు పంపిస్తున్నాడని తెలిపారు. ఇంకా దారుణమైన విషయం ఏమిటంటే బ్యాంక్ కి నాని కొల్లెటరల్ గా తన ఆస్తులు తాకట్టు పెట్టడం జరిగింది. ఆ తనఖా పెట్టిన స్థలానికి నారాయణ కాలేజీకి లీజ్ కి ఇస్తే 20 లక్షల రూపాయలు ఆదాయం వస్తున్న బ్యాంక్ కి లోన్ కట్టడం లేదన్నారు. అలాగే ఎనికెపాడులో తనఖాలో వున్న సైట్ ను టాటా కంపెనీకి లీజ్ కి ఇచ్చే నేపథ్యంలో ఒక అగ్రిమెంట్ చేసుకోవటం జరిగిందని. ఆ స్థలం పై ఎలాంటి కేసులు లేవని, తనకి చెందిన స్థలమే అంటూ టాటా కంపెనీ వాళ్ళ దగ్గర కోటి రూపాయలు అడ్వాన్స్ తీసుకుని . టాటా లాంటి ఉన్నతమైన కంపెనీని మోసం చేసిన ఘనుడు నాని అన్నారు. తాను టాటా బ్రాండ్ అని చెప్పుకునే ఆ పెద్దమనిషి.. టాటా కంపెనీని నాని ఇచ్చి అగ్రిమెంట్ తన దగ్గర వుందన్నారు. కోటి రూపాయలు తీసుకున్నావు..ఎవరి సొమ్ము ఎవరికి అద్దెకి ఇస్తావు..ఇప్పటి వరకు అది బ్యాంక్ సొమ్మే...42 కోట్లు ఎన్.పి.ఎ అయిన తర్వాత ఇవాళ ఈ తతంగం అంతా జరుగుతున్న నేపథ్యంలో బ్యాంక్ ఏమి చేస్తోందని నాగుల్ మీరా సూటిగా ప్రశ్నించారు. బ్యాంక్ లోన్ తీసుకుని కట్టకుండా వున్న ఇటువంటి వ్యక్తి మీద బ్యాంక్ ఎందుకు చర్యలు తీసుకోకుండా వుందో అర్థం కావటం లేదన్నారు. ఈడీ తో పాటు సిబిఐ ఎంక్వైయిరీ చేయాలని డిమాండ్ చేశారు. ఎంపి కేశినేని శివనాథ్ తన నిజాయితీ నిరూపించుకునేందుకు సిబిఐ ఎంక్వైయిరీ కోరుతూ లేఖరాశారు. నువ్వు ఆరోపించిన వ్యక్తి నిష్పక్షపాతంగా విచారణ చేయాలని కోరుతూ సిబిఐకి లేఖరాశారు. బ్యాంక్ లోన్ విషయంలో తాను ఎలాంటి తప్పు చేయలేదని దమ్ముగా ప్రెస్ మీట్ పెట్టి చెప్పే సత్తా వుందా అంటూ ప్రశ్నించారు. నానికి సిగ్గు శరం వుండదని, ఎవరైన అప్పు ఇస్తే చెప్పులు అరిగే దాకా తిరిగినా ఆ డబ్బులు తిరిగి వచ్చే పరిస్థితి వుండదన్నారు. నానికి బ్యాంకులో లోన్స్ మాత్రమే కాదు, బస్సుల పై లోన్ తీసుకున్నాకట్టే అలవాటు లేదన్నారు. చివరికి తను తిరిగే బెంజ్ కారు లోన్ కట్టక సెల్లార్ లో పెట్టిన పెద్దమనిషి నాని అంటూ ఎద్దేవా చేశారు. తను నానికి 25 ఏళ్ల దగ్గర గా వున్నాను.తన సంగతి అంతా నాకు తెలుసు ఏ రోజు పిల్లికి భిక్షం పెట్టని వ్యక్తి అంటూ మండిపడ్డారు.. అహంకార పూరితంగా వ్యవహరించి తన చుట్టుపక్కల ఎవరు మిగలకుండా, కనీసం స్నేహితులు కూడా లేకుండా చేసుకున్నాడు,. చివరికి నాని అమ్మ చెల్లి కూడా కూడా తన వెంట లేరు. నానికి చివరికి ఎవరి మిగిలారో చెప్పాలంటూ సూటిగా ప్రశ్నించారు. ఎ ముఖం పెట్టుకుని ఇలాంటి అసత్య ఆరోపణలు చేస్తున్నావో అర్థం కావటం లేదు. ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. నాని తన గురువు జగన్ లాగా తల్లి, చెల్లిని పక్కన బెట్టాడన్నారు. నాని చేసే అసత్య ఆరోపణలకు ఆధారాలు లేవన్నారు. కానీ తాము చేసే ఆరోపణలకు ఖచ్చితమైన ఆధారాలు వున్నాయన్నారు. నాని ఇచ్చిన అగ్రిమెంట్ , హోటల్స్ మార్చినటువంటి బిల్లు,అదే రకంగా ట్రిబునల్ కి వెళ్లిన కేసు ఇన్ని లోసుగులు, లోపాలు వెంట పెట్టుకుని అవతలి వారిపై అసత్య ఆరోపణలు చేసేముందు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గమే ధ్యేయంగా, ఎస్.సి, ఎస్.టీ, మైనార్టీ బలహీన వర్గాలలకు అండగా నిలబడే ఎంపి కేశినేని శివనాథ్ పై నాని మాట్లాడే మాటలు రోత పుట్టిస్తున్నాయన్నారు. ఇంతవరకు కేశినేనినాని, ఎంపి కేశినేని శివనాథ్



పై చేస్తున్న ఆరోపణలు అన్నదమ్ముల మధ్య జరిగే వివాదంగా భావించి చాలా మంది మాట్లాడం లేదన్నారు.. ఇవాళ నానిది కేవలం ఒక గొంతుక మాత్రమేనని, ఎంపి కేశినేని శివనాథ్ కి వేలాది గొంతకులు వున్నాయన్నారు...ఏడు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ప్రతి ఒక్కరు కూడా మాజీ ఎంపి కేశినేని నానిని ఛీ కొడుతున్నారని తెలిపారు. నాని నోటి దూల కారణంగా ఎంపిగా ఓడిపోవటం జరిగిందన్నారు. నానికి రెండుసార్లు ఎంపి సీటు ఇచ్చి గెలిపించిన వారిపై విశ్వాసం...కృతజ్ఞత లేదన్నారు . రాజకీయ భిక్ష పెట్టిన సీఎం చంద్రబాబు నాయుడు విమర్శిస్తాడు. మంత్రి నారా లోకేష్ ను, చిరంజీవి, తెలుగుదేశం నాయకుల్ని అందర్ని విమర్శిస్తాడని, నానికి విమర్శించటం ఒక అలవాటుగా మారిందన్నారు. అవతల వాళ్ల ఎదుగుల చూస్తే నానికి ఓర్వలేని తనం వుందన్నారు. ఒక అసూయ తోటి ఆక్రోశం తోటి ఇవ్వాళ కేశినేని శివనాథ్ (చిన్ని) కి విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అసత్య ఆరోపణలు చేస్తున్నాడన్నారు. వంద అబద్ధాలు ఆడితే కనీసం రెండు అబద్ధాలైన నమ్మారా అనేటువంటి ఒక అపోహలో నాని బ్రతుకుతున్నాడన్నారు.

కాబట్టి ఇకనైనా నాని పద్ధతిగా మాట్లాడాలని హితవు పలికారు. లేకపోతే నానిని వదిలే ప్రసక్తి లేదన్నారు.నాని బ్యాంక్ కి లోన్ కట్టకుండా తప్పించు తిరుగుతున్న నేపథ్యంలో త్వరలో విచారణ జరుగుతుందన్నారు. భవిష్యత్తులో జగన్ రెడ్డి, కేశినేని నాని ఒక సెల్ లో వుండబోతున్నారన్నారుఅక్కడ ఇద్దరు చార్లెస్ శోభరాజ్ గురించి అక్కడ మాట్లాడుకుంటారని చెప్పారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి కొట్టేటి హనుమంతురావు, టిడిపి సీనియర్ దళిత నాయకులు కామాదేవరాజ్ పాల్గొన్నారు.

## శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



**విజయవాడ పశ్చిమ మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న నిర్మాణపనులు త్వరగా పూర్తి చేయాలనిఇంద్రకీలాద్రి పుణ్యక్షేత్రంపై చేపట్టిన నిర్మాణపనులు త్వరగా పూర్తి చేయాలని,భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించే దిశగా రాష్ట్రప్రభుత్వ సంకల్పం సాకారం చేయాలని ఆలయకార్యనిర్వాహణాధికారి వి.కె.శీనానాయక్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో చేపట్టవలసిన మిగతా అభివృద్ధి పనులు, నవగ్రహ మండపం ప్రారంభం కొరకు తీసుకోవలసిన చర్యలు, నూతన యాగశాల, నూతన పూజా మండపాలు అందుబాటులోకి తీసుకురావడం గురించి క్షేత్రస్థాయి పర్యటన జరిపారు.మల్లేశ్వరస్వామి వారి ఆలయం చుట్టు ప్రక్కల పచ్చదనం పెంపొందించడం, సుందరీకరణ పనులు చేపట్టాలని ఆదేశించారు.దాత సహాయంతో నిర్మించిన యాగశాల మిగతా పనులు త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.పూజా మండపం రెండవ అంతస్తుపైకి ఎక్కిపరిశీలించారు.పూజా మండపం ప్లాన్ చూసి, పూర్తి అయిన పనుల వివరాలు తెలుసుకున్నారు.త్వరగా పనులు పూర్తి అయ్యేలా కాంట్రాక్టర్లతో సంప్రదించి, పురోగతి చూపించాలని, అభివృద్ధి పనులుపై రోజువారీగా క్షేత్రస్థాయి సమీక్ష అవసరమని కార్యనిర్వహణాధికారి పేర్కొన్నారు.

## శ్రీవాణి దర్శన టికెట్లపై దుష్ప్రచారం సరికాదు

**తిరుమల మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి):** తిరుమలలో ఆఫ్‌లైన్ లో ఇస్తున్న శ్రీవాణి దర్శన టికెట్ల మిగిలిపోయాయంటూ సోషియల్ మీడియాలో కొందరు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని టీటీడీ పేర్కొంది. వాస్తవానికి ఆన్ లైన్‌లో 500 టికెట్లు, తిరుపతి ఎయిర్ పోర్ట్ లో 200 టికెట్లను అందుబాటులో ఉంచగా ఎప్పటికప్పుడు భక్తులు బుక్ చేసేసుకుంటున్నారు.ఏరోజు కూడా ఆన్ లైన్ లో శ్రీవాణి దర్శన టికెట్లు మిగిలిన సందర్భం లేదు. తిరుమలలో భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజు 800 టికెట్లను భక్తులకు ఆఫ్ లైన్ లో జారీ చేస్తున్నారు. గత కొన్ని రోజుల్లో ఆఫ్ లైన్ లో పదుల సంఖ్యలో తగ్గాయేకాని,కొందరు వ్యక్తులు సోషియల్ మీడియాలో గతవారం రోజుల్లో వందల సంఖ్యలో టికెట్లు మిగిలిపోయినట్లు ప్రచారం చేయడం పూర్తిగా అవాస్తవం. అవాస్తవ సమాచారాన్ని ప్రచారం చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీయడం తగదని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

## కైకలూరు ప్రజలను వేధిస్తున్న అప్రకటిత కరెంటు కోతలు.

***అప్రకటిత కరెంటు కోతలతో తీవ్రంగా నష్టపోతున్న రొయ్యలు చెరువుల రైతులు.***



**కైకలూరు మే 13 (వార్తా ప్రభ)** ఏలూరు జిల్లా కైకలూరులో ప్రజలు అప్రకటిత కరెంట్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే జరిగే ఈ విద్యుత్ అంతరాయాలు గ్రామీణ ప్రాంతాల్లో రోజువారీ జీవన విధానాన్ని ప్రభావితం చేస్తున్నాయి. రొయ్యలు చేపల చెరువుల రైతులు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వ్యాపారస్తులు,విద్యార్థుల ఆన్‌లైన్ తరగతులు,గృహ అవసరాలు అన్నింటిపై ఈ కోతలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.వేడి పెరుగుతున్న వేసవి కాలంలో శీతలీకరణ పరికరాలపై ఆధారపడే ప్రజలకు ఈ కరెంట్ కోతలు అసహనానికి గురిచేస్తున్నాయి. సుమారు రెండు గంటల నుంచి మూడు గంటల వరకు కరెంటు కోతలు విధిస్తున్నారు. కరెంటు కోతల వల్ల రొయ్యలు చెరువులు రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు.స్థానికులు ఈ సమస్యపై ఆవేదన వ్యక్తం చేస్తూ, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.విద్యుత్ శాఖ అధికారుల ప్రకారం, ఈ కోతలు సాంకేతిక లోపాలు మరియు లోడ్ పెరుగుదల వల్ల సంభవిస్తున్నాయని చెబుతున్నారు. అయితే, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రజల ఇబ్బందిని దృష్టిలో పెట్టుకుని అప్రకటిత కరెంటు కోతలు లేకుండా చూడాలని పై అధికారులు రాజకీయ నాయకులు వెంటనే స్పందించి కరెంటు కోతలు లేకుండా చూడాలని కైకలూరు నియోజకవర్గం ప్రజలు కోరుకుంటున్నారు.

## జాతీయ ఉపాధి హామీ పథకం లో నిధులు గోల్ మార్....

● 2007 నుండి నేటివరకు సుమారు రూ 40 లక్షలు నిలువునా ఆర్థిక దోపిడీ....● అధికారుల వాటా ఎంత...? మస్తరు కూలీల వాటా ఎంత.....? ● అర్హత లేని వృద్ధులు....ఇతర జిల్లాల్లో చదువుతున్న విద్యార్థులకూ దిన దిన మస్తరు కేటాయింపు.... ● ఉపాధి పనిలో లేకున్నా కుటుంబ సభ్యులు, బంధువులకు ప్రశ్నించే నాథుడు లేకపోవడంతో తలబిరుచు తనంతో ఇష్టానుసారంగా మస్తరు నిర్వహణ...

**చెరుకుపల్లి మండలం మే 13 ( వార్తాప్రభ ప్రతినిధి):-** పిల్లి గుడ్డిదైతే ఎలుక వెక్కిరించిందనే చందంగా అధికారులకు ధన దాహనం ఎక్కువైన కొద్దీ కింది స్థాయి సిబ్బంది యథేచ్ఛగానే ఆర్థిక దోపిడీకి అడ్డుఆపు లేకుండా కొనసాగుతున్న తరుణం... అలాంటి దోపిడీ సాక్షాత్తు బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గ పరిధిలోని చెరుకుపల్లి మండల పరిధిలో ఉన్న ఆరుంబాక గ్రామ పంచాయతీ పరిధిలో ఉదంతం చోటుచేసుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం మైనర్ పంచాయతీ అయిన ఆరుంబాక పంచాయతీలో జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ఒకరు అక్రమ సంపాదన కోసం అడ్డదారులు తొక్కిన సంఘటన వెలుగులోకి వచ్చింది. తనకు అనుకూలమైన తమ సమీప బంధువులతో పాటు ఇంకొంతమందిని కూలీలుగా సమకూర్చుకొని జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు దొడ్డిదారి మళ్ళించడంలో ఫీల్డ్ అసిస్టెంట్ అడుగులు ముందుకు వేసింది. నిబంధనలకు తిలోదకాలు ఇచ్చిన ఆ ఘనురాలు పాలకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయన్న ధీమాతో పొరుగు జిల్లాల్లో చదువుతున్న తన సంతానమైన కొడుకు, కూతురు పేర్లను ఉపాధిహామీ పథకంలో నిర్భయంగా చేర్చి నిధులు దారి మళ్ళించినట్టు పక్కా రికార్డులున్నాయి. అంతే గాకుండా అంగ వైకల్యం గల సుమారు 80 సంవత్సరాల వయస్సు దాటిన తన ఇంట్లో మనిషికి మస్తరు వేయడం వింతగా ఉందని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ సొంత నియోజకవర్గంలో ఇంత దగా చోటు చేసుకోవటం మూలంగా తె.దే.పా నాయకులే తలలు పెట్టుకొంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ హొదాలోనే బరితెగించి ఇంతటి విచ్చలవీడి తనంతో అవినీతి జరుగుతున్నా పై స్థాయి అధికారులు ఘాడ నిద్రలో కొనసాగుతూ నిక్షపరాయుని విధులు నిర్వర్తించడం పలు అనుమానాలకు తావిస్తోంది. నేటి కాలానుగుణంగా ప్రభుత్వ కార్యకలాపాల వ్యవహారికమందు నీకూ నాకూ చెరిసగం వాటా అంటూ తందా పరిపాటైపోయిన సంగతి లోకానికి కళ్ళకు కట్టినట్లు అగుపిస్తున్న సంగతి విదితమే కదా.... ఉపాధి హామీ పథకంలో కొంతమంది పనిలో లేకున్నను 2007 సంవత్సరంలో తయారు చేసిన ఉపాధి హామీ పథకానికి సంబంధించిన జాబితా ప్రకారం పనివారందరికి విధిగా అందరికీ హాజరు పడుతుందని ఇలాంటి ఆరోపణల్లో నిజానిజాలు తేల్చడాని జాతీయ ఉపాధి హామీ పథకం వివరాల చిట్టాను చూపించాలని సీనియర్ నాయకుడైన నేను అడిగినా...... ఆ ఫైల్ తనకు ఫీల్డ్ అసిస్టెంట్ చూపించడంలేదని ఆరుంబాక గ్రామ పంచాయతీ సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు తన ఆవేదనను వ్యక్తం చేశారు . బాధ్యతాయుతైన శైలిలో నడుచుకునే తనకు ఫైల్ అందించకుంటే సమాచార హక్కు చట్టం ప్రకారం తాను ఆ ఫైల్ తెప్పించు కొంటానని కోటేశ్వరరావు కుండబద్దలు కొట్టినట్లు కరాఖండిగా అన్నారు. ఆరుంబాక గ్రామ పంచాయతీలో చోటు చేసుకున్న అతిదారుణమైన మోసపూరిత ఉదంతాన్ని బాపట్ల జిల్లా స్థాయి అధికారులు ఉద్యోగ బాధ్యతల ధర్మంలో భాగంగా రంగంలోని దిగి నిజనిజాలు పై అన్వేషణ చేసి నిర్మొహమాటంగా నిగ్గు తేల్చాలని స్థానిక గ్రామములోని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## తిరుమల శ్రీవాణి దర్శన టికెట్లకు తగ్గిన డిమాండ్

**తిరుమల మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)::** శ్రీవాణి దర్శన టికెట్లకు గత వారం నుంచి స్పందన తగ్గింది. ఆరు రోజుల్లో 4113 టికెట్లు మిగిలిపోవడం గమనార్హం.తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం రోజూ వేలాది మంది భక్తులు పోటీపడుతుంటారు. సాధారణ సర్వదర్శనం నుంచి రూ.300 ప్రత్యేక దర్శనానికి, వీఐపీ బ్రేక్ దర్శనానికి, ఆర్జిత సేవలతో పాటు శ్రీవాణి ట్రస్ట్ దర్శన టికెట్లు కూడా భక్తులకి అందుబాటులో ఉంటాయి. అయితే ఇటీవల శ్రీవాణి ట్రస్ట్ టికెట్లకు ఆశించినంత స్పందన లేకపోవడం ఇప్పుడు చర్చకు దారి తీసింది.టీటీడీ ప్రతిరోజూ సుమారు 1500 శ్రీవాణి దర్శన టికెట్లను విడుదల చేస్తుంటుంది. కానీ గడచిన ఆరు రోజులలో కలిపి 4113 టికెట్లు బుక్ కాకుండా మిగిలిపోయాయి. గతంలో ఈ టికెట్లకు మంచి క్రేజ్ ఉండేది. భక్తులు ముందుగానే బుక్ చేసుకోవడం వల్ల, ఈ టికెట్ల కోసం తిరుపతి ఎయిర్‌పోర్టులోనూ, తిరుమలలోనూ కౌంటర్లు ఏర్పాటు చేసిన సందర్భాలు ఉన్నాయి.

## డ్రైన్లో త్రాగునీటి పైప్లైన్లు ఉండరాదు

***విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలు***



**విజయవాడ పశ్చిమ మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజలకు త్రాగునీటి సరఫరా చేసే విషయంలో అశ్రద్ధ వహించరాదని, ప్రత్యేకంగా డ్రైన్లలో త్రాగునీటి పైప్లైన్లు ఉండరాదని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర ఆదేశించారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా 30 డివిజన్ దేవీనగర్, జివిఆర్ నగర్ పరిసర ప్రాంతాలని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.డ్రైన్లో త్రాగునీటి పైప్లైన్లు ఎట్టి పరిస్థితుల్లో ఉండరాదని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పైప్లైన్లు విడిగా పెట్టి త్రాగునీటి సరఫరా లో డ్రైన్లో కలవకుండా చూసుకునేటట్టు అధికారుల చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమినిటీ సెక్రటరీలు ప్రతిరోజు త్రాగునీటి శుద్ధత పరీక్షలు చేయడమే కాకుండా వారి వారి వార్డులలో పర్యటించి డ్రైన్లలో ఎటువంటి త్రాగునీటి పైప్లైన్ కలవకుండా చూసుకోవాలని, వారు అధికారులకు ప్రతిరోజు నివేదికను సమర్పించాలని అధికారులు ఎప్పటికప్పుడు నివేదికను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆ వార్డ్ లో ఉన్న సమస్యలన్నీ క్షేత్రస్థాయిలో తెలిసేందుకు అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ద్విచక్రవారంపై వార్డు మొత్తం పర్యటించి, ఆ వార్డులో గల పారిశుద్ధ్య నిర్వహణ, కన్స్ట్రక్షన్ అంటే డెమోలిషన్ వ్యర్థాల సమస్యలను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని, అధికారులతో ఆదేశించారు.జివిఆర్ నగర్లో నిర్మాణం జరుగుతున్న ఎలివేటెడ్ సర్వీస్ లెవెల్ రిజర్వాయర్ మరియు డ్రైనేజీ పంపింగ్ స్టేషన్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

## వాసవి సేవాసమితి అధ్వర్యంలో అన్నదానం



**జగ్గయ్యపేట మే 13 (వార్తప్రభ)** శ్రీ వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో 100రోజుల చలి వేంద్రం వద్ద మంగళవారం ఉమ్మడి కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు జగ్గయ్యపేట ఏఎంసి చైర్మన్ తుమ్మేపల్లి నరేంద్రరావు సతీమణి జిల్లా పద్మావతి జన్మదినం సందర్భంగా వారి కుమారుడు మండల ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు తుమ్మేపల్లి వెంకటేశ్వరరావు సహకారంతో అన్న దానం నిర్వహించారు. రవ్వ కేసరి స్వీట్, ఆవకాయ అన్నం, సాంబారు అన్నం, పెరుగన్నం పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఆర్య వైశ్య సంఘం వర్తక వాణిజ్య విభాగం చైర్మన్ కొత్తా పురుషోత్తం, మాజీ ఏఎంసీ చైర్మన్ మానేపల్లి నాగ బ్రహ్మం, జిల్లా వాసవి సేవాసమితి గౌరవాధ్యక్షులు పేరూరి నరసింహా రావు, జిల్లా మహిళా వాసవి సేవా సమితి అధ్యక్షురాలు వాసా నాగ మణి, జిల్లా వాసవి సేవా సమితి అధ్యక్ష, కోశాధికారులు యన్నాకుల రాంబాబు, కంభంపాటి రవి కుమా ర్, ఏపిఎంపిఏ నియోజకవర్గ జర్న లిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కాకరపర్తి వెంకట రమేష్ లు పాల్గొని పంపిణీ చేశారు.

## కేర్ అండ్ షేర్ చారిటబుల్ ట్రస్ట్ కు పూర్వవిద్యార్థులు ఆర్థిక సహాయం



**జగ్గయ్యపేట మే 13 (వార్తప్రభ)**షేర్ మహమ్మద్ పేట గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఈనెల 4వ తేదీన 2005-2006 ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉపాధ్యాయుల్లో ఒకరైన వర ప్రసాద్ మాస్టర్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన కృష్ణవేణి విజయవాడలోని కేర్ అండ్ షేర్ చారిటబుల్ ట్రస్ట్ నందు వాలంటీర్ గా వర్క్ చేస్తున్నది, అక్కడ చాలామంది అనాథ పిల్లలు ఉన్నారు. వారి పోషణ కొంచెం కష్టతరంగా మారిందని తెలిసింది. ప్రతినెలా కొంత సాయం చేస్తున్నాను, అనాథ పిల్లలకు సాయం చేయాలని కోరారు. గురువు మాటని గౌరవించిన విద్యార్థులు సహాయంగా డబ్బులు 14500/- సేకరించారుఈ డబ్బులను మంగళవారం అనాథ పిల్లల సహాయం కోసం విజయవాడ వెళ్లి కేర్ అండ్ షేర్ చారిటబుల్ ట్రస్ట్ కు అందజేయడం జరిగింది. భవిష్యత్తులో కూడా మా వంతు సహాయ సహకారాలు అనాథ పిల్లల కోసం చేస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరప్రసాద్ మరియు పూర్వ విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు.

# నైపుణ్యాభివృద్ధి విభాగాల ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు

● లక్ష్యసాధనకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలి ● జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేయండి ● నైపుణ్యం పోర్టల్ ను సింగిల్ ప్లాట్ ఫామ్ గా తీర్చిదిద్దాలి ● ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంటర్ వృత్తి విద్యల బలోపేతం ద్వారా ఉద్యోగాల కల్పనకు కృషి ● నైపుణ్యాభివృద్ధి శాఖపై సమీక్షలో మంత్రి నారా లోకేష్ దిశానిర్దేశం



**ఉండవల్లి: మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నైపుణ్యాభివృద్ధి విభాగాల ద్వారా రాష్ట్రంలో వచ్చే ఐదేళ్లలో లక్షల సంఖ్యలో ఉద్యోగ అవకాశాల కల్పనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఉండవల్లి నివాసంలో నైపుణ్యాభివృద్ధి శాఖపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. నైపుణ్యాభివృద్ధి శాఖలోని స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, న్యాక్, సీడాప్, ఓంక్యాప్ విభాగాలు కలిసికట్టుగా పనిచేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించారు. నైపుణ్యం పోర్టల్ ను సింగిల్ ప్లాట్ ఫామ్ గా తీర్చిదిద్ది.. యువత, పరిశ్రమలను అనుసంధానపరిచే విధంగా సమర్థవంతంగా రూపొందించాలి. నైపుణ్య శిక్షణ.. తద్వారా జరిగే ఉద్యోగ కల్పనను రంగాల వారీగా ట్రాక్ చేయాలి.

**జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేయాలి**

కర్నూలును రెన్యువబుల్ ఎనర్జీ కేంద్రంగా.. చిత్తూరు, కడపను ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ హబ్ గా రూపొందిస్తాం. గోదావరి జిల్లాలను ఆక్వా హబ్ గా మారుస్తాం. అనంతపురం జిల్లాను ఆటోమొబైల్ మ్యానుఫాక్చరింగ్ హబ్ గా అభివృద్ధి చేస్తాం. ప్రకాశం జిల్లాను బయోఫ్యూయల్ హబ్ గా మారుస్తాం. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ఆయా కోర్సుల్లో యువతకు నైపుణ్య శిక్షణ అందించాలి. ఏపీలో భోగాపురం ఎయిర్ పోర్ట్, అమరావతి నిర్మాణం, ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ రావడం వల్లే కలిగే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా యువతకు శిక్షణ ఇవ్వాలి. ఇందులో ముఖ్యంగా న్యాక్ ద్వారా అందజేసే నిర్మాణరంగ నైపుణ్యాలను అంతర్జాతీయ స్థాయిలో అందించే విధంగా కోర్సులు రూపొందించాలని ఆదేశించారు. ఐటీలో వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. భవిష్యత్ లో విమానయాన రంగం, ఆక్వా, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫాక్చరింగ్, కంప్రెస్డ్ బయో గ్యాస్ రంగాల్లో లో విస్తృత అవకాశాలు ఉంటాయి. ప్రస్తుతం ఏసీ మెకానిక్ లు, లిఫ్ట్ ఆపరేటర్లు, సోలార్ టెక్నీషియన్ల కొరత ఉంది. అధికారులు ఆయా రంగాల్లో ఉద్యోగ, ఉపాధి కల్పనపై దృష్టి కేంద్రీకరించాలి. జిల్లాల వారీగా యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేయాలి.

**ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంటర్ వృత్తి విద్యల బలోపేతం ద్వారా ఉద్యోగాల కల్పనకు కృషి** ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంటర్ వృత్తి విద్యల బలోపేతానికి పేరెన్నికగన్న పరిశ్రమల ద్వారా కరిక్యులమ్ ను రూపొందించి.. జాతీయ, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్ ను అందించడం ద్వారా ఉద్యోగాల కల్పనకు కృషిచేయాలి. ఇంటర్ తో పాటు ఇంజనీరింగ్ కరిక్యులమ్ ను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభిప్రాయపడ్డారు. పాఠశాల మధ్యలోనే చదువు నిలిపివేసిన ప్రతిఒక్కరిని ట్రాక్ చేసి, వారు కోరుకున్న విధంగా నైపుణ్య శిక్షణను అందించి నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్ వర్క్ ప్రకారం మరిన్ని ఉపాధి అవకాశాలు పొందే విధంగా కోర్సులు రూపొందించాలని ఆదేశించారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు ఫైనాన్షియల్ లిటరసీ, వ్యవసాయం, ఇతర వృత్తుల పట్ల ఆర్థిక అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు. అలాగే కాలేజీ, యూనివర్సిటీ స్థాయిల్లోనే విద్యార్థులకు తగిన నైపుణ్యాలను అందించి ఉద్యోగాలు పొందే సామర్థ్యాన్ని పెంపొందించాలని ఆదేశించారు. సమావేశంలో సీడాప్, ఓమ్ క్యాప్, న్యాక్ విభాగాలపైనా సమగ్రంగా సమీక్షించడం జరిగింది. ప్రతి విభాగం ద్వారా ప్రతి ఏడాది అందించవలసిన ఉద్యోగ కల్పన లక్ష్యాలను, ఇతర కేపీఐ(కీ ఫెర్ఫార్మింగ్ ఇండికేటర్స్) ను రూపొందించాలని సూచించారు. సీడాప్ ద్వారా కల్పించే రెసిడెన్షియల్ ట్రైనింగ్ ల్లో నాణ్యతను పాటిస్తూ థర్డ్ పార్టీ సర్టిఫికేషన్ ను తప్పనిసరి చేసి వందశాతం ఉద్యోగాల కల్పనను సాధించాలని ఆదేశించారు. అదేవిధంగా ఓమ్ క్యాప్ ద్వారా విదేశాల్లో ఉద్యోగ అవకాశాల పట్ల యువతకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ విభాగం కార్యదర్శి కోన శశిధర్, ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఎండీ, సీఈవో జి.గణేష్ కుమార్, కాలేజి ఎడ్యుకేషన్ డైరెక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా, సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి, సీడాప్ సీఈవో నారాయణ స్వామి, ఇంటర్నేషనల్ స్కిల్లింగ్ అండ్ మొబిలిటీ అడ్వైజర్ శ్రీమతి సీత శర్మ, ఏపీఎస్ఎస్ డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాలను బాధ్యతగా నివారించాలి

- ఆర్డీవో కె.చైతన్య - ఎన్టీటీపీఎస్ లో మాక్ డ్రిల్





**ఇబ్రహీంపట్నం, మే 13 (వార్తా ప్రభ ప్రతినిధి):** ప్లాంట్ లో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించి నివారించాలని ఆర్డీవో కె.చైతన్య సూచించారు. దేశంలో ప్రస్తుత ఉద్రిక్తతల దృష్ట్యా ఇబ్రహీంపట్నంలోని ఎన్టీటీపీఎస్ సర్వీస్ బిల్డింగ్ వద్ద మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ తోటి వారు ప్రమాదంలో చిక్కుకుంటే వారిని రక్షించాలన్నారు. పూర్తి రక్షణ కలిగిన ప్రాంతంలోకి వెళ్లి పరిస్థితులు చక్కబడే వరకు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. డీసీపీ ఎస్.వి.డి.ప్రసాద్ మాట్లాడుతూ ప్రమాదం జరిగినప్పుడు దాన్ని ఎదుర్కొనేందుకు, రక్షణ చర్యలు తీసుకునేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇలా చేస్తే ప్రమాదాలను నివారించడంతోపాటు ప్రాణ నష్టం లేకుండా చూడవచ్చన్నారు. ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ పి.శివరామాంజనేయులు మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లా ఏడీఎఫ్ వో కె.వినయ్ గ్యాస్ ఫైర్ ప్రమాదాలు, ఆయిల్ ఫైర్ ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా నివారించవచ్చో ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఎస్డీఆర్ఎఫ్, పోలీస్, రెవెన్యూ, వైద్య సిబ్బంది, ఎన్టీటీపీఎస్ ఫైర్, రక్షణ, ఎస్పీఎఫ్, వైద్య సిబ్బంది హాజరయ్యారు. కార్యక్రమానికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సేఫ్టీ) ఎం.నాగబాబు సంధానకర్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్ స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ టి.రాజు, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, పశ్చిమ జోన్ ఏసీపీ దుర్గారావు, ఎస్ హెచ్ వో ఎ.చంద్రశేఖర్, మైలవరం ఫైర్ ఆఫీసర్ గౌతమ్, ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఐ కె.వెంకటేశ్వర్లు, ఆర్ఎస్సై వి.సుధాకర్, ఇబ్రహీంపట్నం పీహెచ్ సీ వైద్యాధికారి డాక్టర్ సయ్యద్ ఫర్వీన్, ఎన్టీటీపీఎస్ ఫైర్ డిపార్ట్ మెంట్ నుంచి శాస్త్రి, సెక్యూరిటీ డిపార్ట్ మెంట్ నుంచి వెంకటేశ్వరరావు, ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమెండెంట్ కృష్ణమాచారి, పర్యవేక్షక ఇంజనీర్లు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

# దుబాయిలో బ్యాంకు ఖాతా కేసులో జైలు పాలయిన జగిత్యాల జిల్లావాసి

సమస్య పరిష్కారానికి సీఎంఓ ద్వారా ప్రత్యేక శ్రద్ధకు ప్రజావాణి ఇంచార్జి జి. చిన్నారెడ్డి హామీ



**హైదరాబాద్, మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) దేశంలోని దుబాయికి బతుకుదెరువు కోసం వెళ్లిన జగిత్యాల జిల్లావాసి ఒకరు తన బ్యాంకు ఖాతాను ఇతరులు దుర్వినియోగం చేసిన కేసులో జైలు పాలయిన సంఘటన ఇటీవల జరిగింది. జగిత్యాల ల్ జిల్లా పెగడపెల్లి మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన మల్లారపు మధుకర్ (27) అనే యువకుడు ఎవరో తన బ్యాంకు ఖాతాను దుర్వినియోగం చేసి లావాదేవీలు జరిపినందున అజ్మాన్ లోని కోర్టు అతనిపై ప్రయాణ నిషేధం (ట్రావెల్ బ్యాన్) విధించింది. మధుకర్ తల్లిదండ్రులు మల్లవ్వ, అంజయ్యలు మంగళవారం హైదరాబాద్, బేగంపేట లోని మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్ లో 'ప్రవాసీ ప్రజావాణి' లో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేరిట ఒక వినతి పత్రం సమర్పించారు. ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచన మేరకు ప్రజాభవన్ కు చేరుకున్న వారికి ఎన్నారై అడ్వయిజరీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి సహకరించారు. సీఎంఓ ద్వారా ప్రత్యేక శ్రద్ధతో సమస్య పరిష్కారానికి పరిష్కరిస్తామని ప్రజావాణి ఇంచార్జి, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి. చిన్నారెడ్డి వారికి హామీ ఇచ్చారు. గల్ఫ్ దేశంలో జైలు పాలయిన మధుకర్ కు కాన్సులర్ (దౌత్య) సహాయంతో పాటు న్యాయవాదిని సమకూర్చి ఉచిత న్యాయ సహాయం అందించి ఇండియాకు వాపస్ తెప్పించాలని వారు అభ్యర్థించారు. న్యూ ఢిల్లీ లోని భారత విదేశాంగ శాఖతో, దుబాయి లోని భారత రాయబార కార్యాలయంతో సమన్వయం చేసి తన కుమారుడిని ఆదుకోవాలని వారు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. వినతి పత్రం ప్రతిని తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (న్యాయ సేవాధికార సంస్థ) కు కూడా పంపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరులో కృష్ణా, విజయనగరం, ప్రకాశం జిల్లాలు

● వెనుకబడ్డ రాయలసీమ- అట్టడుగున అనంతపురం జిల్లా ● జిల్లా వైద్యాధికారుల పనితీరుపై ఆరోగ్య శాఖా మంత్రి అసంతృప్తి ● జిల్లా కార్యాలయాల్లో అవినీతికి అడ్డుకట్ట వేయాలని ఆదేశం ● పర్యవేక్షణ, పనితీరు మెరుగుపర్చడానికి స్పష్టమైన నిర్దేశాలు ● ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలుపై మంత్రి సుదీర్ఘ సమీక్ష

**అమరావతి, మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా స్థాయిలో వివిధ ఆరోగ్య సేవలు, పథకాలు అమలవుతున్న తీరుపై ఆరోగ్య శాఖా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ మంగళవారం నాడు మూడున్నర గంటల పాటు సుదీర్ఘ సమీక్ష చేపట్టారు. జిల్లాల వారీగా అమలు తీరును సోదాహరణంగా వెల్లడించి ర్యాంకులను ప్రకటించారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంతో పాటు వివిధ పథకాల అమలును పర్యవేక్షించే జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు(డిఎంహెచ్వోలు) మరియు జిల్లా ఆరోగ్య సేవల సమన్వయకర్తలు(డిసిహెచ్‌యస్‌లు) పనితీరుపై కొంత అసంతృప్తిని వ్యక్తం చేసి వారు జవాబుదారీ తనంతో పనిచేసే దిశగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. జిల్లా వైద్యాధికారుల కార్యాలయాలపై వస్తున్న అవినీతి ఆరోపణలపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసి, అవినీతిని అడ్డుకట్ట వేయడానికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలోని జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు (డీఎంహెచ్‌వోలు), జిల్లా ఆరోగ్య సేవల సమన్వయకర్తల (డీసీహెచ్ఎస్‌లు)తో మంగళవారం నాడు వెలగపూడిలోని ఏపీ సచివాలయం నుండి వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఇతర విభాగాధిపతులు సమీక్షా సమావేశంలో పాల్గొనగా ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వీరపాండియన్ వర్చువల్‌గా పాల్గొన్నారు.

**జిల్లాలవారీ పనితీరు** అంతర్గత మదింపు ప్రకారం జిల్లాల వారీగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవల్ని అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పిహెచ్‌సిలు) మరియు పట్టణ ప్రాంతాల్లో పనిచేసే పట్టణ పిహెచ్‌సిల పనితీరును మంత్రి వెల్లడించారు. ఈ విషయంలో ఉమ్మడి కృష్ణా జిల్లా మొదటి స్థానంలోనూ, విజయనగరం మరియు ప్రకాశం జిల్లాలు ఆ తరువాతి స్థానంలోనూ ఉన్నాయని ఆయన తెలిపారు. అనంతపురం జిల్లా పనితీరులో అట్టడుగు స్థానంలో ఉండగా, మిగిలిన 3 రాయలసీమ జిల్లాలు క్రింది స్థానాల్లో ఉండడంపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆందోళన వెలిబుచ్చారు. ఆయా జిల్లాల పనితీరుకు సంబంధించి జిల్లా వైద్యాధికారుల నుంచి వివరణ అడిగారు. ఈ పరిస్థితిని మెరుగుపర్చడానికి తగు చర్యల్ని చేపట్టాలని ఆయన ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరులో వెనుకబడడంతో పాటు రాయలసీమలోని సెకండరీ ఆసుపత్రుల పనితీరుపై కూడా మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. నిర్దేశిత లక్ష్యాల్లో 7 జిల్లాలు 10 శాతం(అనంతపురం, కర్నూలు)నుంచి 24 శాతం( తిరుపతి జిల్లా) మేరకే శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు మంత్రి శ్రీ



సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో మాత్రం 42 శాతం మేరకు శస్త్ర చికిత్సలు జరిగాయి. ఆసుపత్రుల్లో జరిగే ప్రసవాల్లో కూడా రాయలసీమ ప్రాంతంలోని ప్రభుత్వ సెకండరీ ఆసుపత్రుల తీరు మెరుగుపడాలని మంత్రి సూచించారు. దీంతోపాటు డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల వినియోగంలో రాయలసీమ జిల్లాల్లోని సెకండరీ ఆసుపత్రులు బాగా వెనుకబడడంపై మంత్రి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వైయస్సార్ జిల్లాలోని సెకండరీ ఆసుపత్రులు చేసిన సర్జరీల్లో కేవలం 3 శాతమే ఎన్టీఆర్ వైద్య సేవలో నమోదయ్యాయి. మొత్తమ్మీద రాయలసీమ జిల్లాల్లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద గరిష్టంగా 25 శాతం చికిత్సలు మాత్రమే నమోదవడం ఆందోళనకరమని, ఈ విషయంలో కనీసం 30 శాతం శస్త్ర చికిత్సలు ఎన్టీఆర్ వైద్య సేవలో నమోదు చేయడానికి తగు చర్యలు చేపట్టాలని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

**జిల్లా వైద్యాధికారుల పనితీరును మెరుగుపర్చేందుకు చర్యలు అవినీతిని అడ్డుకునేందుకు నిర్ణయాలు**

జిల్లా వైద్యాధికారుల పనితీరుపై ఆరోగ్య రంగంలో ఆయా జిల్లాల ప్రగతి ఆధారపడి ఉంటుందని, ఈ విషయంలో మరింత మెరుగైన ఫలితాలను సాధించడానికి సమీక్షా సమావేశంలో సుదీర్ఘ చర్చ అనంతరం మంత్రి కొన్ని నిర్ణయాల్ని ప్రకటించారు. వీరి పనితీరుపై పర్యవేక్షణాలోపం, పనితీరు అంచనా మరియు రిపోర్టింగ్‌లో ఉన్న లోపాల్ని మంత్రి ఎత్తి చూపారు. జిల్లా వైద్యాధికారుల కార్యాలయాలు అవినీతికి అడ్డాలుగా మారాయని వస్తున్న వార్తలు, ప్రజాభిప్రాయంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఆశించిన మేరకు పరిపాలనా అనుభవం లేని జిల్లా వైద్యాధికారులు కింది స్థాయి పాలనా సిబ్బందిపై ఆధారపడడంతో పలు అక్రమాలు జరుగుతున్నాయని మంత్రి అన్నారు. జిల్లా స్థాయిలో జరిగే నియామకాలు కేవలం ప్రతిభ ఆధారంగా జరగాల్సి ఉన్నా ఉద్యోగాలిప్పిస్తామంటూ జిల్లా కార్యాలయాల్లో అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేయడంపై మంత్రి సత్యకుమార్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. దీన్ని అరికట్టేందుకు ఆయా జిల్లా వైద్యాధికారులు నియామక సమయాల్లో ప్రతిభ ఆధారిత ఎంపిక విషయాన్ని వెల్లడిస్తూ, అభ్యర్థులెవరూ దళారుల బారిన పడొద్దని పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. జిల్లా అధికారుల పాలనా సామర్థ్యాన్ని పెంచి కింది స్థాయి సిబ్బందిపై ఆధారపడకుండా చేసేందుకు తగు శిక్షణా కార్యక్రమాల్ని చేపట్టాలని కూడా మంత్రి సత్యకుమార్ యాదవ్ నిర్ణయించారు. జిల్లా కార్యాలయాల్లో కింది పాలనా సిబ్బంది దీర్ఘ కాలంపాటు పనిచేయడం వల్ల అక్రమాలకు తావిస్తోందని, దీన్ని అడ్డుకునేందుకు వారిని మూడేళ్లకోసారి బదిలీ చేయాలని మంత్రి ఆదేశించారు. వైద్యాధికారులు, పాలనా సిబ్బంది వ్యవహార శైలికి సంబంధించి పలు మార్గాల ద్వారా సమాచారాన్ని సేకరించుకుని అక్రమార్కులపై ముందస్తు చర్యలు చేపట్టే వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని మంత్రిత్వ శాఖలోని సంబంధిత ఉన్నతాధికారుల్ని మంత్రి ఆదేశించారు.జిల్లా వైద్యాధికారులు, పాలనా సిబ్బందిలో ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకుంటారన్న భయం లేకుండా పోయిందని, ఈ పరిస్థితిలో తగు మార్పు తేవడానికి మంత్రిత్వ శాఖలోని సంబంధిత ఉన్నతాధికారులు అవసరాల మేరకు తక్షణమే స్పందించి, తగు చర్యలు చేపట్టి , అక్రమాలకు వ్యతిరేకంగా సరైన సందేశాన్నివ్వాలని మంత్రి స్పష్టం చేశారు. జవాబుదారీ తనంతో జిల్లా వైద్యాధికారులు పనిచేసేందుకు ఏడాదికి రెండు సార్లు వారి పనితీరును మదింపు చేసి...పనితీరు బాగోలేదు, బాగుంది, చాలా బాగుంది అని గ్రేడ్లు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ప్రతి అధికారి తమ పరిధిలో ఉన్న ప్రతి సెంకడరీ ఆసుపత్రిని నిర్దిష్ట కాలపరిమితిలో సందర్శించి అక్కడి లోటుపాట్లపై నివేదికలు సమర్పించాలని సమీక్షా సమావేశంలో నిర్ణయించారు. వారి క్షేత్రస్థాయి పర్యటనలకు సంబంధించి స్పష్టమైన విధివిధానాల్ని రూపొందించి వాటి ద్వారా ప్రయోజనకరమైన నివేదికలు ఉన్నతాధికారులకొచ్చేలా చూడాలని మరో నిర్ణయాన్ని తీసుకున్నారు. జిల్లా వైద్యాధికారుల పనితీరుపై క్రమం తప్పకుండా తనకు నివేదికలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు.ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజల ఆరోగ్యం కోసం ఎంతో కృషి చేస్తున్నా ప్రచార మాధ్యమాల్లో వస్తున్న వ్యతిరేక వార్తల ద్వారా నష్టం జరుగుతోందని, సానుకూల ప్రజాభిప్రాయం కోసం వివిధ ఆసుపత్రులు చేస్తున్న సేవల వివరాలను, విశిష్టతను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ మీడియాలో వస్తున్న వ్యతిరేక వార్తలకు సంబంధించి వాస్తవాల్ని ప్రజలకు తెలియజేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు.

# విజయవాడ ఎమ్ పి కేశినేని శివనాథ్( చిన్ని) ని మర్యాద పూర్వకంగా కలిసిన దుర్గగుడి ఈ ఓ



**విజయవాడ పశ్చిమ మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్(చిన్ని)ని శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వి.కె.శీనానాయక్ మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిసి శ్రీ అమ్మవారి ప్రసాదములు అందించారు.అనంతరం ఆలయ అభివృద్ధి పనులు, భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న చర్యలు గురించి కార్యనిర్వాహణాధికారి పార్లమెంట్ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వ పథకమైన ప్రసాద్ పథకం ద్వారా ఇంద్రకీలాద్రి అభివృద్ధికి చేస్తున్న ప్రయత్నాలు గురించి, కేంద్ర మంత్రులను సంప్రదిస్తున్న విషయాలు గురించి ఎంపీ శివనాథ్ (చిన్ని) వివరించారు.

# మున్సిపల్ కమిషనర్ కు కార్మికుల సమ్మె నోటీసు



**ఇబ్రహీంపట్నం, మే 13 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తనకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) కార్మికులు మంగళవారం సమ్మె నోటిసు అందజేశారు. మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20న సమ్మె నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబర్ 36 ప్రకారం జీతాలు పెంచాలన్నారు. 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) కొండపల్లి అధ్యక్షుడు బి.అప్పారావు, కార్యదర్శి జి.సురేష్, ఉపాధ్యక్షుడు దేవుళ్లు, రమణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సీబీఎస్ఈ లో ఆగిరిపల్లి చిన్నారుల ప్రతిభ







**ఆగిరిపల్లి, మే 13, (వార్త ప్రభ )** కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాలలో ఆగిరిపల్లి చిన్నారులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నూజివీడులోని కుమార్ పబ్లిక్ స్కూల్ లో విద్యాభ్యాసం చేసిన విద్యార్థులు ఫలితాలలో తమ సత్తా చాటారు. ఆగిరిపల్లి కి చెందిన దాసరి వెంకట సుబ్బారావునిశాంత్ (483),తవ్వా మోహన కృష్ణ అనిరుద్ (471),యాదల తేనేష్ (461) మార్కులు సాధించారు. నూజివీడు బిస్ స్కూల్లో విద్యాభ్యాసం చేస్తూ 10 పరీక్షలు రాసిన ఆగిరిపల్లి విద్యార్థి దేశబోయిన తేజస్విన్(455), నవోదయ పాఠశాలలో పరీక్ష రాసిన బెక్కం శివ నాగ ప్రశాంత్ (460) సాధించాడు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల పలువురు విద్యార్థులను, పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.

# ఘనంగా బుద్ద పూర్ణిమ రజతోత్సవ వేడుకలు

**మంగళగిరి :మే 13 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నగరంలోని గౌతమబుద్దా రోడ్ రాయల్ కన్వెన్షన్ హాల్ ఆవరణలో సోమవారం బుద్ధ పూర్ణిమ రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుద్ద విహార అధ్యక్షులు రేఖా కృష్ణార్జున రావు,సాహితీ కళా వేదిక కన్వీనర్ గుత్తికొండ ధనుంజయరావు, ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, ప్రజా నాట్య మండలి జిల్లా నాయకులు కంచర్ల కాశయ్య, విశ్వశాంతి కళా పరిషత్ కన్వీనర్ పొట్లాబత్తుని లక్ష్మణరావు, మానవతా వేదిక కన్వీనర్ గోలి మధు, ప్రత్యూష సుబ్బారావు , దామర్ల కుబేర స్వామి, అల్లక తాతారావు తదితరులు పాల్గొన్నారు.



## రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ వారి ఆధ్వర్యంలో
## గ్యాస్ ఆధారిత పోర్టబుల్ క్రిమేటర్

● తేదీ: బుధవారం, 14 మే 2025..
సమయం: ఉదయం 10:00 గంటలకు..
● స్థలం: రోటరీ వైకుంఠ ప్రస్థానం, 8వ లైన్, రాజేంద్ర నగర్, గుడివాడ..




**గుడివాడ,మే 13 (వార్తాప్రభ) :** రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ అధ్వర్యంలో కోల్ ఇండియా లిమిటెడ్ వారి సిఎస్ఆర్ ప్రాజెక్ట్‌గా, రోటరీ డిస్ట్రిక్ట్ 3020 ద్వారా అమలుకాబడుతున్న గ్యాస్ ఆధారిత పోర్టబుల్ దహనవాటిక (పోర్టబుల్ క్రిమేటర్) ప్రారంభ కార్యక్రమం 14వ తేది (బుధవారం) ఉదయం 10 గం॥లకు గుడివాడ –రాజేంద్ర నగర్ 8వ లైన్‌లోని రోటరీ వైకుంఠ ప్రస్థానం నందు ప్రారంభించనట్లు రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ వారి ఆధ్వర్యంలో జరుగుతుందనీ తెలిపారు. ముఖ్య అతిథిగా మునిసిపల్ కమీషనర్ సింహాద్రి మనోహర్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రొటేరియేన్ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ గ్యాస్ ఆధారిథ దహనవాటిక (పోర్టబుల్ క్రిమేటర్) లో ఎల్.పి.జి గ్యాస్ వాడటం వలన చాలా తక్కువ ఖర్చు తో దహన సంస్కారాలు పూర్తవుతాయని, కట్టె పుల్లలు వాడకపోవడం వలన, చెట్లు సంరక్షింపబడి, పర్యావరణం కాపాడబడుతుందని తెలియ పరిచారు. ఈ ఆహ్వాన కార్యక్రమంలో రోటరీ కమ్యూనిటీ సర్వీస్ ట్రస్ట్ అధ్యక్షులు రొటేరియన్ జి. బాబు శ్రీకర్, కార్యదర్శి రొటేరియన్ వి. రామ కృష్ణ లు అలాగే రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ అధ్యక్షులు రొటేరియన్ టి.ఎన్. రాజేశేఖర్, కారదర్శి రొటేరియన్ జి. కిరణ్ బాలు లు పాల్గొన్నారు.


## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని కాక భారత రాజ్యాంగాన్ని అమలు చేయాలి

- రాష్ట వైసీపీ మహిళ విభాగం ఉపాధ్యక్షురాలు జమ్ములమడక



**తాడేపల్లి,మే 13 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని కాక భారత రాజ్యాంగాన్ని అమలు చేయాలనిరాష్ట్ర వైసీపీ మహిళ విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి డిమాండ్ చేశారు. మంగళవారం తాడేపల్లి వైసిపి కార్యాలయంలో జరిగిన స్టేట్ మహిళ సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 19(1) ప్రకారం ప్రాథమిక హక్కులుగా వాక్ స్వాతంత్రపు హక్కు భావ ప్రకటన స్వాతంత్ర హక్కు లను రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి ఇచ్చిందని శాంతియుతంగా ప్రభుత్వ విధానాలను నిరసనలను తెలిపే హక్కు రాజ్యాంగం ఇచ్చిందని అన్నారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను చూస్తే ప్రజలకు ముఖ్యంగా మహిళలకు ఎటువంటి రక్షణ లేకుండా పోయిందని ప్రశ్నించిన వారి పట్ల మహిళల పట్ల అవమానకరంగా వ్యవహరిస్తూ మహిళలను సైతం అక్రమ కేసులలో ఇరికించి అవమానించి అర్ధరాత్రి సైతం ఇళ్లలోకి చొరబడి మహిళలను అరెస్టులు చేస్తున్న తీరు చూస్తుంటే మనం ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఉన్నామా లేక రాచరిక వ్యవస్థలో ఉన్నామా అనే అనుమానం కలుగుతుందని అన్నారు. ఆర్టికల్ 19(2) ప్రకారం ప్రకారం జాతీయ భద్రత ప్రజా క్రమం మర్యాద నైతికత కోర్టుధిక్కారం పరువు నష్టం ఇతరులను నేరానికి ప్రేరేపించడం వంటి ప్రయోజనాల దృష్ట్యా ఈ హక్కులపై సహేతుకమైన పరిమితులు విధించవచ్చని అటువంటి సంఘటనలు ఏమి జరగకపోయినా ఈ కూటమి ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆమె అన్నారు ప్రభుత్వం ఇకనైనా ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడకుండా ప్రజా సంక్షేమం పట్ల రాష్ట్ర అభివృద్ధి పట్ల దృష్టి పెట్టాలని ఇప్పటికే ప్రభుత్వం తాను వాగ్దానం చేసిన సూపర్ సిక్స్ పథకాలను విస్మరించి ప్రజల యొక్క విశ్వాసాన్ని కోల్పోతుందని ఇకనైనా రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా చేసిన వాగ్దానాలను నిలుపుకుని ప్రజలను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆమె హితవు పలికారు.

## దేశసైన్యానికి, నాయకత్వానికి దైవబలం మెండుగా ఉండాలి - మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ,మే 13 (వార్తాప్రభ) :** పాకిస్థాన్ కు గట్టి గుణపాఠం చెప్పిన దేశసైన్యానికి, నాయకత్వానికి దైవబలం మెండుగా ఉండాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కాంక్షించారు. సైనికుల సంకల్ప బలానికి దైవ బలం తోడుగా ఉండాలని పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలనుసారం జనసేన తరపున పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, వీర మహిళలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాల్లో షష్ట షణ్ముఖ క్షేత్రాలు, ఇతర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు శ్రీ కుమార సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో మంత్రి కందుల దుర్గేష్ వేద మంత్రోచ్ఛరణల మధ్య అర్చనలు, అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వరుని ఆశీస్సులు దేశ సైనికులకు తోడుగా ఉండాలని కాంక్షించారు. పాకిస్తాన్ ముష్కరులను అణచివేసేలా చూడాలని భగవంతున్ని ప్రార్థించానన్నారు. ఉద్రిక్త వాతావరణం మధ్య విధులు నిర్వహిస్తున్న సైనికులకు తోడుగా యావత్ దేశ ప్రజలు అందరూ అండగా ఉన్నామని భరోసానిచ్చారు. జాతీయతను పెంపొందించే విషయంలో జనసేన పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

## ఉచిత మజ్జిగ పంపిణిలో ఆదర్శంగా నిలుస్తున్న గుడివాడ వాకర్స్ క్లబ్స్




**గుడివాడ,మే 13 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్ క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో క్లబ్ మేనేజింగ్ ట్రస్టి లింగం చిట్టిబాబు మరదలు నాదెండ్ల వెంకట కృష్ణవేణి జ్ఞాపకార్థం కెనరా బ్యాంక్ ఎదురుగా చలివేంద్రంలో ఉచిత మజ్జిగ ప్యాకెట్లు 600 పంపిణీ చేశారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు లోయ ఈశ్వర వెంకటేశ్వరరావు ప్రారంభించి లింగం చిట్టిబాబు వితరణతో గత వారం నుండి అనేక సేవా కార్యక్రమాలు క్లబ్ వేదికగా మానవసేవే మాధవసేవ అనే దృక్పథంతో నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కోన రామారావు, కార్యదర్శి దిమ్మిటి శ్రీనివాసరావు, కోశాధికారి తమ్మినేని రామ్మోహన్రావు, బొప్పన కుటుంబరావు, మున్నలూరి రామకృష్ణ, పొన్నూరు సత్యనారాయణ, కొమరవోలు రామకృష్ణ, కందిపల్లి సూరి, కూరాకుల శ్రీ విష్ణు, మారడాని వెంకటేశ్వరరావు, మసిముక్కు వెంకటేశ్వరరావు, సాయిబాబు, పి. కామేశ్వరరావు, మేకల లక్ష్మణరావు పాల్గొన్నారు.

**గుడివాడ వాకర్స్ అసోసియేషన్ వారీ ఆధ్వర్యంలో.. :** ఈరోజు మే 13 వ తారీకు ఉదయం 12 గంటలకు ఎనిమిదవ రోజు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ దేవస్థాన సింహద్వారం నందు తాడికొండ సురేంద్ర వితరణతో చల్లటి మజ్జిగ పంపిణీ కార్యక్రమం 500 మందికి జరిగినది. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా దేవస్థానం కమిటీ ప్రెసిడెంట్ జవ్వాజి గంగరాజు ప్రారంభించి అయితా గోపాలకృష్ణమూర్తి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో గుడివాడ వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.వి. సత్యనారాయణ, సెక్రటరీ లక్ష్మీనారాయణ రెడ్డి, ట్రెజరర్ చలువాది మోహన్ రావు, జిల్లా సెక్రెటరీ చిన్నం గంగాధర్ రావు, తాడికొండ సురేంద్ర, వీరశేఖర్, చంద్రశేఖర్, జగ్గారావు, కసెట్టి ఉమామహేశ్వరరావు లు పాల్గొని జయప్రదం చేసినారు.

## చెడుగా ప్రవర్తిస్తే ప్రతిఘటించాలి.. పోక్సో చట్టంపై కిశోర బాలికలకు అవగాహన




**గుడివాడ,మే 13 (వార్తాప్రభ) :** గుడివాడ సెకండ్ సెక్టార్ పరిధిలో గల ఎన్టీఆర్ కాలనీ 1, 3, 4 సెంటర్సు నందు కిషోరి వికాసం ప్రోగ్రాం సందర్భంగా 13వ తేదిన కిషోర బాలికల సమ్మర్ క్యాంప్ ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా డి.సి.పి.యు కౌన్సిలర్ జె. స్వరాజ్యం కిషోర బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ బాలల హక్కుల రక్షణ పోక్సో చట్టం గురించి అవగాహన, బాల్య వివాహాలు, బాల కార్మికులు గురించి అలాగే గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ గూర్చి మరియు ఎమర్జన్సీ నంబర్ 1098 తదితర వాటి గురించి కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎంఎస్‌కె సురేఖ, ఏఎన్ఎం రమణమ్మ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ వర్కర్స్ ఆసియబేగం, అప్పాయమ్మ, దుర్గ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

**గుడివాడ రూరల్ మండలంలో.. :** గుడివాడ రూరల్ అన్ని సచివాలయాలలో కిశోరి వికాసం శిక్షణా తరగతులలో భాగంగా మంగళవారం కిశోరి బాలికలకు సుపర్‌వైజర్ నసీరున్నీసా బాలల హక్కులు మరియు పోక్సో చట్టం గురించి వివరించారు. బాలల హక్కులు అంటే ప్రతి ఒక పిల్లలకి సమానంగా వివక్ష లేకుండా లభించే హక్కులు, స్వేచ్ఛలు.. ఈ హక్కులు పిల్లల మనుగడ అభివృద్ధి, రక్షణ మరియు సామాజిక భాగస్వామ్యానికి సంబంధించినవని సుపర్‌వైజర్ నసీరున్నీసా తెలియజేసారు. ఇందులో లింగవరం, కార్యకర్తలు కృష్ణకుమారి, లీల, ఉమ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదభరితంగా మారిన ప్రహరీని పరిశీలించిన ఈ.ఈ. రమాదేవి





**పెనుగంచిప్రోలు,మే 13 (వార్తాప్రభ) :** ఇటీవల సింహాచలం దేవాలయంలో జరిగిన ప్రమాదంలో ఏడుగురు మృతిచెందగా పలువురికి గాయాలయ్యాయి ఈ నేపథ్యంలో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం ఆలయ ఈ ఈ రమదేవి ఏఈ రాజుతో కలిసి అమ్మవారి సత్రాలకు 18 సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రహరీ గోడ పరిశీలించారు. ఈ ప్రహరీ పలుచోట్ల పగుళ్లు ఏర్పడి ప్రమాద భరితంగా ఉండటంతో వెంటనే గోడ పక్కనే నివాసం ఉన్న బంగారు కాలనీ వాసులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్రాలు చుట్టూ నిర్మించిన గోడ పది అడుగుల ఎత్తులో 18 సంవత్సరాల క్రితం నిర్మించారని గోడకి అనుకొని భారీ వృక్ష (చెట్లు)లు పెరగడంతో గోడకు పలుచోట్ల పగుళ్లు ఏర్పడ్డాయని మొదటగా ప్రమాద భరితంగా ఉన్న గోడలను తొలగించి వాటి స్థానంలో తాత్కాలికంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని మొత్తం 400 అడుగుల ప్రహరీ గోడ ఉన్నదని ప్రధానంగా 100 అడుగుల గోడ పలుచోట్ల బాగా చీలిక వచ్చి ఉన్నదని వెంటనే దాన్ని తొలగించి కొత్తగా ప్రహరీ గోడ నిర్మించేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ ఉన్నత అధికారులకు అంచనాలను పంపించి వారి అనుమతులు రాగానే నూతన ప్రహరీ గోడ నిర్మాణం చేపడతామని తెలిపారు.అలాగే గోడ నిర్మాణం జరిగే వరకు కాలనీవాసులు ఎవరు గోడ పగుళ్లు ఏర్పడ్డ ప్రదేశంలో ఎవరు ఉండదని కాలనీ వాసులకు సూచించానని తెలిపారు.

## గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా సతీష్ కుమార్



**పెనుగంచిప్రోలు,మే 13 (వార్తాప్రభ) :** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు నూతన గ్రామ అధ్యక్షుల ఎన్నికపై తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం మండల పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య అధ్యక్షతన సోమవారం రాత్రి స్థానిక ఆర్కే ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నూతన ఎన్నికపై కార్యకర్తలతో చర్చించారు. మరలా కొత్తపల్లి సతీష్ కుమార్ గ్రామ అధ్యక్షుడిగా ఉండాలని కార్యకర్తలు అందరూ ఏకాభిప్రాయం తెలిపారు,ఈ సందర్భంగా చింతల సీతారామయ్య మాట్లాడుతూ కార్యకర్తలు అదరూ ఇదే మారిగా క్రమశిక్షణతో ముందుకు సాగాలని కోరారు....... రఘు రామ్ కు సముచిత స్థానం ఇవ్వాలి............తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి పార్టీకి విధేయుడుగా ఉంటున్న మాజీ మంత్రివర్యులు నెట్టెం రఘురాంకు రాష్ట్ర నాయకత్వం సముచిత స్థానం కల్పించాలనితెలుగుదేశం మండల పార్టీ తరఫున కోరుతున్నట్లు చింతల సీతారామయ్య తెలిపారు.జిల్లా లో గత ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాలు గెలవటానికి నెట్టెం రఘు రామ్ ఏంతో కృషి చేశారని, రాజకీయం గా ఎన్ని అవకాశాలు వచ్చినా తెలుగుదేశం పార్టీ ఎదుగు దలకు అవకాశలు వదులుకున్న వ్యక్తి నెట్టెం రఘు రామ్ అన్ని తెలిపారు. అలాంటి వ్యక్తి కీ రాష్ట్ర నాయకత్వం రఘు రామ్ కు సముచిత స్థానం కల్పించి న్యాయం చేయాలని తెలిపారు,ఈ కార్యక్రమంలో తిరుపతమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ లు కర్ల వెంకటనారాయణ, కాకాని శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ జిల్లేపల్లి. సుదీర్ బాబు,చుంచు. రమేష్ బాబు, గజ్జి కృష్ణమూర్తి, గింజుపల్లి. గోపి, నల్లమోలు. వర ప్రసాద్, నారాయణ,కర్ల నాగేశ్వరావు, నలుపునేని కొండ ముళ్లపాటి. ప్రసాద్ మాస్టారు. ప్రభాకర్, నూతల పాటి, కృష్ణ. కొలి పాక, బ్రాహ్మం,ముళ్లపాటి. రాము, ముళ్లగిరి. రాంబాబు, చిన్న మీరయ్య, చిరంజీవి.పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ తిరుపతమ్మ కు ఘనంగా నాయి బ్రాహ్మణుల బోనాణాలు



**పెనుగంచిప్రోలు,మే 13 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారికి నాయి బ్రాహ్మణు లు పిల్లపాపలు తో మంగళవారంఅమ్మ వారికి శ్రీతిరుపతమ్మ కళ్యాణ కట్ట నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కొలిపాక. బ్రాహ్మం, ఏలూరి. శ్రీనివాసరరావు, పాలక మండలి సభ్యులు కొలిపాక రాము,కొలిపాక నాగేశ్వర రావు, వీరస్వామి,చిన్న రంగారావు.ఏలూరి. కృష్ణ, ఉప్పు లక్ష్మిణ రావు, ఆధ్వర్యంలో పిల్లా పాప ల తో కలిసి అమ్మ వారికి ఘనంగా బోణాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



గుడివాడ మండలం చౌట పల్లి గ్రేడ్ త్రీ లైబ్రరీ నందు కృష్ణా జిల్లా గ్రంధాలయ సంస్థ నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పేపర్ క్రాఫ్ట్ తయారు చేసిన లైబ్రరీ విద్యార్థి ఎన్. సుప్రవీణ్.. చిన్నారులందరు వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొనాలని గ్రంథాలయ నిర్వాహకుడు జీ రత్నచంద్ర ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
**- గుడివాడ,మే 13 (వార్తాప్రభ) :**

## సి.బి.యస్.ఇ ఫలితాల్లో వైజ్‌వుడ్స్ విజయదుందుభి




B. Rohith Sai 10th 487/500 | B. Manjunath reddy 12th 454/500

**గుడివాడ,మే 13 (వార్తాప్రభ) :** మంగళవారం సి.బి.యస్.ఇ విడుదల చేసిన 10 మరియు 12 తరగతుల పరీక్షా ఫలితాలలో విశ్వభారతి వైజ్‌వుడ్స్ 100శాతం ఫలితాలను సాధించి విజయదుందుభి మ్రోగించింది. పదవ తరగతి ఫలితాల్లో బి. రోహిత్ సాయి అనే విద్యార్థి 487/500 సాధించి ప్రథమ స్థానంలో నిలవగా పన్నెండవ తరగతి ఫలితాల్లో బి. మంజునాథ్ రెడ్డి 454/500 సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. విశ్వభారతి వైజ్‌వుడ్స్ ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ, డైరెక్టర్స్ ఆర్. మంజుల, ఆర్. ప్రణీత్ లు విజేతలను అభినందించారు. ఛైర్మన్ శ్రీ పొట్లూరి శ్రీమన్నారాయణ విజేతలందరినీ అభినందిస్తూ భవిష్యత్తులో మంచి విజయాలను సాధించాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

## బుద్ధుని బోధనలు మానవాళికి దిక్సూచి



**గుడివాడ,మే 13 (వార్తాప్రభ) :** బుద్ధుడు బోధించిన శాంతి సహనం, అహింస మానవళికి దిక్సూచి అని వక్తలు పేర్కొన్నారు. గుడివాడ నియోజకవర్గం బుద్ధ పూర్ణిమ అమరవీరుల ఘన నివాళులు కార్యక్రమం సోమవారం సాయంత్రం జరిగింది. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం నుంచి బంటుమిల్లి రోడ్ లో గల బౌద్ధ స్తూపం వరకు పాదయాత్ర చేస్తూ ఈ యాత్రను జాతీయ జెండా జండా ఊపి ప్రారంభించిన గుడివాడ స్టేడియం కమిటీ అధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు.. బుద్ధం శరణం గచ్ఛామి అని నినాదాలతో జోహార్ అమరవీరుల జోహార్ అని పాదయాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎక్స్ పిసి చైర్మన్ గుత్తా శివరామకృష్ణ (చంటి), పిరమిడ్ రాజకుమారి, అంబేద్కర్ భవన్ అధ్యక్షులు పొంగులేటి జయరాజు, పిన్నమనేని వేణు గోపాలరావు, కొలుసు రాజా, కృష్ణాజిల్లా బౌద్ధ డైరెక్టర్ రామకృష్ణ, దినకర్, తెలుగుదేశం నాయకులు, అంబేద్కర్ అభిమానులు, బౌద్ధ అభిమానులు, వీర మహిళలు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసినారు.

## చిత్తశుద్ధి, అంకితభావం, కరుణ, సేవ కలగలిపితే నర్సు -గుడివాడ ఎన్జీవో నాయకుడు రాజేంద్ర..

● ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవం..



**గుడివాడ,మే 13 (వార్తాప్రభ) :** అంతర్జాతీయ నర్సుల దినోత్సవ కార్యక్రమాన్ని ఏ.పీ ఎన్జీవోస్ అసోసియేషన్ గుడివాడ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా గుడివాడ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో విధులు నిర్వహిస్తున్న హాస్పిటల్ హెడ్ నర్స్ రజిని, నిర్మల ఫ్లోరెన్స్ లను ఎన్జీవో అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోగులమూడి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటున్నారు. చిత్తశుద్ధి, అంకితభావం, కరుణ, సేవ కలగలిపితేనే నర్సు అని ఆయన పేర్కొన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు వైద్య సేవలదించిన నర్సింగ్ సిబ్బందిని గౌరవించుకోవడం సంతోషకరమని రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ ఇందిరా దేవి, ఎన్జీవోస్ అసోసియేషన్ సభ్యులు కే.పీ రావు, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## 25వేల విలువ చేసే ల్యాబ్ పరికరాలు, బీరువాలు వితరణ



**గుడివాడ,మే 13 (వార్తాప్రభ) :** మంగళవారం శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షులు పుట్టి హరికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కీ॥శే॥ లయన్ ఉప్పల వెంకటేశ్వరరావు 4వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం రాజేంద్రనగర్ లో గల టౌన్ హై స్కూల్ నందు సైన్స్ ల్యాబ్ ఎక్యుమెంట్స్ ల్యాబ్‌కు సంబంధించి పరికరాలు మరియు రెండు ఐరన్ బీరువాలు రూ॥ 25,000/- లు విలువచేసే వస్తువులను టౌన్ హై స్కూల్ నకు వారి కుమారులు ఉప్పల ప్రద్యుత్ బాబు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ స్టేడియం ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం జాయింట్ సెక్రెటరీ కిలారపు రంగ ప్రసాద్, ఎన్టీఆర్ స్టేడియం మాజీ జాయింట్ సెక్రెటరీ పర్వతనేని ఆనంద్, మాజీ కౌన్సిలర్ వసంతవాడ దుర్గారావు, బొగ్గరపు తిరుపతయ్య, శ్రీకృష్ణ ఎంటర్ప్రైజెస్ ప్రోప్రైటర్ పల్లపోతు వెంకట నాగబాబు, ఉప్పల రాజశేఖర్ బాబు, చెరుకూరి రాంబాబు, కేసంశెట్టి అజయ్ కుమార్, జాజుల తాతారావు, జాజుల మునీంద్ర, కంతేటి హరిబాబు, నర్ని వెంకట రామారావు, స్కూల్ హెచ్ఎం డీఎస్ శ్రీనివాసన్, పి. సుగుణారావు రావు, ఎన్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ అవార్డు అందుకున్న కలెక్టర్ నాగరాణిని సన్మానించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ



**ఏలూరు,మే 13 (వార్తాప్రభ) :** పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఇటీవల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న సందర్భంలో, ఆమెను కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ భీమవరం కలెక్టరేట్లో మంగళ వారం శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందిస్తూ సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాగరాణి సేవా భావం ఎంతో అభినందనీయ మన్నారు. వరదల సమయంలో ప్రజలకు అండగా నిలిచారని ఇటువంటి అధికారులు ప్రజల విశ్వాసానికి నిలువెత్తు ఉదాహరణగా నిలుస్తారని ప్రశంసించారు. నాగరాణి ఇటీవల ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ అవార్డు స్వీకరించారు. వరదల సమయంలో ఆమె స్వయంగా లోతట్టు ప్రాంతాలకు వెళ్లి పరిస్థితిని సమీక్షించి, బాధితులకు ఆహార సరఫరా నిర్వహించారు. అంతేకాదు, ఆమె తన వంతుగా ముఖ్యమంత్రి సహాయనిధికి వ్యక్తిగత విరాళం కూడా ఇచ్చారు. ఈ కృషి ఆమెకు రాష్ట్రవ్యాప్తంగా మంచి పేరు తెచ్చింది.

## వెల కట్టలేనివి నర్సుల సేవలు



**కాకినాడ,మే 13 (వార్తాప్రభ) :** నిస్వార్థంగా నర్సులు అందించే సేవలు విలువ కట్టలేనివని దక్షిణాది రాష్ట్రాల కోశాధికారి అలై.వనుం శ్రీనివాస రావు అన్నారు. అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 106 కాకినాడ శ్రీ పద్మారామ్ ఎల్ ఎంఎఫ్ క్లబ్ అధ్యక్షులు తెలాగాని వీరభద్ర రావు అధ్యక్షతన అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అలై వనుం శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్య రంగంలో నర్సుల ప్రాముఖ్యత చాలా విలువైనది అని అన్నారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సింగ్ వ్యవస్థకి ఒక దిక్సూచిగా నిలిచారని, అందువల్లనే నైటింగేల్ పుట్టినరోజును అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా జరుపుకోవడం జరుగుతుం దన్నారు.అనంతరం క్లబ్ అధ్యక్షులు వీరభద్రరావు మాట్లాడుతూ మనకు కనిపించే దేవుళ్ళుగా కోవిడ్ సమయంలో నర్సుల ప్రాముఖ్యత వారి సేవలు వెల కట్టలేనివిగా చెప్పవచ్చునన్నారు. జీజీహెచ్ కాకినాడ హెడ్ నర్స్ హైమావతి, జీజీహెచ్ కాకినాడ స్టాఫ్ నర్స్ వై.రత్న కుమారి, ఎంపీ హెచ్ ఎం ఎఫ్ కరప పీహెచ్ సీ బొడ్డుపల్లి దేవి,ఎంపీ హెచ్ ఎఫ్ జ్యోత్స్న,ఆశ పి.అమూల్య వారి సేవలను గుర్తించి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో డిస్టిక్ క్యాబినెట్ సెక్రెటరీ వెంకీ శివకుమార్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్ వై ఏ. కిరణ్ కుమార్,గవర్నర్ ఏరియా రిప్రజెంట్ సిహెచ్.లక్ష్మీ నాగేంద్ర, ప్రెసిడెంట్ వీరభద్రరావు, క్లబ్ సెక్రటరీ వివి.ప్రసాద్ సత్తిబాబు,సత్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయం 3 లో కిశోర్ వికాసం ప్రోగ్రామ్



**పెనుగంచిప్రోలు,మే 13 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ చిల్లకల్లు సిడిపివో లక్ష్మీ భార్గవి ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఉషా రాణి ఆధ్వర్యంలో మంగళవారం కిషోర్ వికాసం ప్రోగ్రామ్ సచివాలయం 3 లో నిర్వహించడం జరిగింది,ఈ ప్రోగ్రాం ఒక్క మొక్క ఉద్దేశం 11 టు 18 సంవత్సరాల పిల్లలకు బాలల హక్కులు వారి రక్షణ మరియు చట్టం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎజి గర్ల్స్ తల్లులు ఎంఎస్కేలు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొ న్నారు.

## వెంకటాపురం గ్రామ పార్టీ అధ్యక్షులుగా కేసరి వెంకటేశ్వరరెడ్డి





**జి.కొండూరు,మే 13 (వార్తాప్రభ) :** మండలంలోని వెంకటాపురం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా కేసరి వెంకటేశ్వరరెడ్డి నియామకమయ్యారు. తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు ఆదేశాల మేరకు టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మంగళవారం సాయంత్రం గ్రామ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్త లు ఆమోదంతో మండల పార్టీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పజ్జూరు రవికుమార్, లంక రామకృష్ణ వరప్రసాద్ గ్రామ కమిటీని నియమించారు.గ్రామ పార్టీ అధ్యక్షులుగా కేసరి వెంకటేశ్వర రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.పార్టీ సెక్రటరీగా యరమల మధుసూదన్ రెడ్డి, గ్రామ పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి ఈజిగీయ తోపాటు మరి కొంతమందిని గ్రామ కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

**పార్టీ బలోపేతానికి కృషి చేస్తా-కేసరి..** గ్రామ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన తాను పార్టీ పటిష్టత కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కేసరి వెంకటేశ్వర రెడ్డి అన్నారు. ప్రాపర్టీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడానికి సహకరించిన గ్రామ పార్టీ నాయకులు,కార్యకర్తలకు ము-ఖ్యంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు కు వెంకటేశ్వర రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజే శారు.

# సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేశానికి ధైర్యం ఇవ్వాలి..

- మోపిదేవి దేవస్థానంలో ఎంపీ, ఎమ్మెల్యే పూజలు.
- భారీ జాతీయ పతాకంగా తిరంగా ర్యాలీ.





**మోపిదేవి/అవనిగడ్డ,మే 13 (వార్తాప్రభ) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఆలయానికి వచ్చిన ఎంపీ, ఎమ్మెల్యేకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని దేశం కోసం, సైన్యం కోసం ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం మోపిదేవి పురవీధుల్లో భారీ జాతీయ పతాకంతో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ పెహల్గామ్ ఘటనతో దేశం దిగ్భ్రాంతికి గురైందన్నారు. ఉగ్రవాద దుశ్చర్యకు బలైన రాష్ట్ర వాసులకు జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆర్థిక సహాయం చేశారన్నారు. ఆపరేషన్ సింధూర్ లో ప్రాణాలు కోల్పోయిన రాష్ట్ర సైనికుని కుటుంబానికి పవన్ కళ్యాణ్ స్వంతంగా రూ.25 లక్షలు అందించారని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా ఎవరైనా భారత్ జోలికి వస్తే ఏం చేయగలమో నిరూపించామన్నారు. అయినా కవ్వింపు చర్యలకు పాక్ పాల్పడుతున్న నేపథ్యంలో దేశ ప్రధానికి, సైన్యానికి ధైర్యం, స్ఫూర్తి ఇవ్వాలని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ యువతలో దేశ భక్తి ప్రేరేపించేందుకు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని తెలిపారు. పెహల్గామ్ ఘటనపై దేశంలో మొట్టమొదట స్పందించిన పార్టీ జనసేన అని తెలిపారు. సైన్యానికి ఇతోధిక బలం, భారత ప్రభుత్వానికి ఆశీస్సులు పుష్కలంగా ఇవ్వాలని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు చేసినట్లు తెలిపారు. దేశ రక్షణకు మోపిదేవి స్వామి శక్తి, ఆశీస్సులు ఇవ్వాలని, ప్రధాని మోడీకి బలం, ఉత్తేజం ఇవ్వాలని పూజలు చేసినట్లు తెలిపారు. త్రివర్ణ పతాక రెపరెపలతో ప్రతి ఒక్కరిలో స్ఫూర్తి కలిగించినట్లు తెలిపారు. ఎన్ని విపత్తులు వచ్చినా ఈ దేశాన్ని కాపాడుకోవాలని బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. ఒప్పందాలు ఉల్లంఘించడం పాకిస్తాన్ కు అలవాటు అని, ఈ స్థితిలో ప్రధానికి అండగా, సైన్యానికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, శీలం అశ్విన్ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్, నియోజకవర్గ బందరు నియోజకవర్గ ఇంచార్జి బండి రామకృష్ణ, పెడన నియోజకవర్గ ఇంచార్జి పంచకర్ల సురేష్, పామర్రు నియోజకవర్గ ఇంచార్జి తాడిశెట్టి నరేష్, ఏపీఐఐసీ డైరెక్టర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్, పెనమలూరు నియోజకవర్గ నాయకులు ముప్పా రాజా, గుడివాడ నాయకులు సందు పవన్, ఘంటసాల, గన్నవరం ఏఎంసీ చైర్మన్లు తోట కనకదుర్గ, గరికిపాటి శివశంకర్, విజయవాడ నాయకురాలు డాక్టర్ రాధికా మాధవి, జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేవస్థానం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంఎల్ఏ మండలి బుద్ధప్రసాద్ పరిశీలించి పలు సూచనలు చేశారు.

## ప్రెస్ అకాడమీ చైర్మన్ గా ఆలపాటి సురేష్ నియామకం పట్ల అభినందనల వెల్లువ



**హనుమాన్ జంక్షన్,మే 13 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ గా సీనియర్ జర్నలిస్ట్ ఆలపాటి సురేష్ కుమార్ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించటంతో హనుమాన్ జంక్షన్ లో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హనుమాన్ జంక్షన్ కు చెందిన ప్రముఖులు స్వాతంత్ర్య సమరయోధులు ఆలపాటి లక్ష్మయ్య, సత్యన్నారాయణ ల సోదరుడు ఆలపాటి రంగారావు కుమారుడు ఆలపాటి సురేష్. ఆలపాటి రంగారావు ఉద్యోగరీత్యా గుంటూరు జిల్లాలో ఉండేవారు.సురేష్ విజయనగరం, మహబూబ్ నగర్ హైదరాబాద్ ఇండియన్ ఎక్స్ ప్రెస్, ఆంధ్రప్రభ దినపత్రికలో పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు.అనంతరం టి.వి, 9 లో ఇన్ పుట్ ఎడిటర్ గా పనిచేశారు. రెండు సంవత్సరాలు పాటు నిర్వహించనున్న ఈ పదవీ బాధ్యతలు కేబినెట్ రాంక్ హోదా కల్పిస్తుంది. ఆలపాటి సురేష్ 2019– 2024 వరకు రాష్ట్రంలో జరిగిన మరణ కాండను విధ్వంసం పేరుతో కళ్ళకు కట్టినట్టు రాసిన పుస్తకాన్ని అప్పట్ మాజీ ముఖ్యమంత్రి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. అది ఆలపాటి కి మంచి పేరు తెచ్చిపెట్టింది. ప్రెస్ అకాడమీ చైర్మన్ గా తనకు పదవీ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును సోమవారం మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రెస్ అకాడమీ చైర్మన్ గా ఆలపాటి సురేష్ ను నియమించటం పట్ల హనుమాన్ జంక్షన్ వివిధ ప్రాంతాల్లో ఉన్న కుటుంబ సభ్యులు, స్నేహితులు , జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ ఆలపాటి కి ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, ప్రింట్ & ఎలక్ట్రానిక్ న్యూస్ ( పెన్ ) అమరావతి క్యాపిటల్ రీజియన్ ప్రెసిడెంట్ లయన్ తాడి రంగారావు, వ్యాపారవేత్త నూలు నరసింహారావు తదితరులు ఉన్నారు.

## మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి స్కీమ్ లపై సమీక్ష






**విజయవాడ,మే 13 (వార్తాప్రభ) :** సబ్ కలెక్టర్ ఆఫీస్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల పరిరక్షణ హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అమలు చేస్తున్న మిషన్ వాత్సల్య మరియు మిషన్ శక్తి స్కీమ్ లపై సమీక్ష ప్రాజెక్ట్ డైరెక్టర్ డి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. పద్మావతి మాట్లాడుతూ బాలల పరిరక్షణ కార్యక్రమలలో బాలల సంరక్షణ కేంద్రాలు అలసత్యం వహిస్తే సహించేదిలేదు అన్నారు. పిల్లలు దత్తత లీగల్ గా జరగాలి. బాల్య వివాహాలు నిషేదించటంలో సంబంధిత అధికారులను భాగ్యస్వాములను చేయాలని ఆదేశించారు. బాల్య వివాహాలు, పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించలని సూచించారు. లైంగిక బాధితులకు పరిహారం అందించాలని సూచించారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు మరియు ఎయిడ్స్ వ్యాధిగ్రాస్తుల పిల్లలకు మిషన్ వాత్సల్య గైడెన్స్ ఆధారంగా ఆర్థిక సహాయం అందించాలని పేర్కొన్నారు. లైసెన్స్ అర్హత కలిగిన బాలల సంరక్షణ కేంద్రాలు మాత్రమే నడపాలని డీపీవో ను ఆదేశించారు. రిజిస్టర్లు, డాకుమెంటేషన్, రికార్డులు భద్రపర్చుకోవాలని సూచించారు. వన్ స్టాప్ సెంటర్ 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. బాలల సంరక్షణ కేంద్రాలలో ఉన్న పిల్లలకు ఐ సి పి, ఎస్ ఐ ఆర్, కేస్ స్టడీ రిపోర్టులు చేయాలని డీసీపీయు సిబ్బందిని ఆదేశించారు. రిస్క్యూ చేసిన బాలలకు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆర్డలు తప్పనిసరిగా ఉండాలిని సూచించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాజేశ్వరరావు పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమం లో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్పర్సన్ సువార్త, రవి భార్గవ్,డీపీఓ జ్యోతి, సీడీపీఓ లు మంగమ్మ, జోష్న, పుష్పలత, సత్యవతి, కృష్ణ కుమారి, లక్ష్మి భార్గవి, డీసీపీయు, ఓ ఎస్ సి, రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్, శిశు గృహ, బాల సదన్, బాలల సంరక్షణ కేంద్రాల సిబ్బంది తదితరుల హాజరయ్యారు.

## ఆపరేషన్ సింధూర్ నీ ఆపింది రక్షణ వ్యూహమా లేదా వ్యాపార అవకాశమా..?

**- ఏపీ కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్**




**విజయవాడ,మే 13 (వార్తాప్రభ) :** యుద్ధాన్ని ఆపినది భారత దేశ రక్షణ వ్యూహమా లేదా దౌత్యం కాదు, వ్యాపార అవకాశమే అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యకు ప్రధాన మంత్రి మోదీ అంగీకరిస్తారా అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్ ప్రశ్నించారు? ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వాస్తవంగా వ్యాపారం యుద్ధాన్ని ఆపిందంటే, అది భారతదేశ స్వాభిమానానికి, ప్రాతంత్ర్యానికి సంబంధించి ఏమి సూచిస్తుందన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాల్పుల విరమణ వ్యాఖ్యలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చకు వస్తోంది. ఈ విషయం మీద ప్రధాన మంత్రి ఎందుకు అధికారికంగా ఎందుకు స్పందించలేదనీ నిలదీశారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ విషయంలో అంతర్జాతీయ నేతలు మాట్లాడుతుంటే, భారత దేశ ప్రభుత్వం మాత్రం మౌనం పాటించడం ఎందుకన్నారు జాతీయ భద్రతా విధానం ఇప్పుడు అంతర్గత వ్యూహాల కంటే బహిరంగ వాణిజ్య ఒత్తిడుల ఆధీనంలో రూపొందించబడు తోందా అని ప్రశ్నించారు? కాల్పుల విరమణ అనంతరం కాశ్మీర్ విషయంలో భారతదేశం ప్రస్తుత అధికారిక స్థానం ఏమిటి? ప్రధాన మంత్రి ఈ అంశంపై దేశాన్ని ఎందుకు ఉద్దేశించి ప్రసంగించలేదు? గతంలో నాయకులు సంక్షోభ సమయాల్లో ధైర్యంగా, పారదర్శకంగా, బాధ్యతతో ముందుకు వచ్చారు. ఈ ప్రభుత్వం మాత్రం గోప్యత వైపు ఎందుకు మొగ్గు చూపుతోందన్నారు. ఈ అత్యంత కీలక పరిణామాలపై ప్రధాని, ప్రభుత్వం పార్లమెంటును పిలిపించి, ప్రతిపక్షాన్ని, ముఖ్యంగా దేశ ప్రజలను నమ్మకంగా తీసుకునే విధంగా ముందుకు వస్తారా లేదా అనేది వేచి చూడాలన్నారు.

## అర్హులందరికీ అన్నదాత సుఖీభవ : యార్లగడ్డ



**గన్నవరం,మే 13 (వార్తాప్రభ) :** అర్హులైన రైతులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్నదాత సుఖీభవ పథకాన్ని అందజేస్తామని ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హామీ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం గన్నవరం ఎండిఓ కార్యాలయంలో వ్యవసాయ, విద్యుత్ శాఖ, డ్రైనేజీ డిపార్ట్మెంట్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం అర్హులైన రైతులందరికీ అందించేలా అధికారులు జాబితాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గన్నవరం నియోజకవర్గంలో అర్హులైన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. రుతుపవనాలు ఇప్పటికే అండమాన్ నికోబార్ దీవులని తాకటంతో ఈ ఏడాది మన రాష్ట్రంలో ముందుగానే వర్షాలు కురిసే అవకాశం ఉందని దీంతో ఖరీఫ్ సీజన్ ముందుగానే మొదలవుతుందన్నారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు కొరత లేకుండా చూడాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ముందస్తుగా వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో విద్యుత్ శాఖ వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రమాదాల నివారణ చర్యలను చేపట్టాలని వంగిపోయిన స్తంభాలను, కిందకు వేలాడతీగలను సరిచేయాలని ఆదేశించారు. ఏడాది భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుండటంతో వరద ముంపు నివారించేందుకు గన్నవరం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో డ్రైనేజీ డిపార్ట్మెంట్ అధికారులు డ్రైనేజీలను శుభ్రం మురుగునీటి పారుదలకు అడ్డంకులు తొలగించాలని ఆదేశించారు. ముందుగా గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన యార్లగడ్డ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## గన్నవరంలో క్రీడావసతుల కల్పన కృషి : యార్లగడ్డ





**గన్నవరం,మే 13 (వార్తాప్రభ) :** క్రీడాకారులకు, యువత కోసం గన్నవరం నియోజకవర్గంలో అన్ని రకాల క్రీడావసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తెలిపారు. గన్నవరం రైల్వే స్టేషన్ రోడ్ లోని ప్రభుత్వభూమిలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో క్రికెట్ బాక్స్, స్విమ్మింగ్ పూల్, బ్యాడ్మింటన్ కోర్టుల నిర్మాణ పనులకు మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే యార్లగడ్డ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు క్రీడా వసతులు కల్పిస్తే వారిలో దాగున్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని తద్వారా జాతీయంగా అంతర్జాతీయంగా క్రీడాకారులు తయారవుతారని పేర్కొన్నారు. యువతలోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు గన్నవరం నియోజకవర్గంలోని ప్రధాన గ్రామాల్లో క్రికెట్ బాక్స్ ఏర్పాటు చేయడంతో పాటు షటిల్ వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు చెప్పారు. ముందుగా గన్నవరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఇక్కడ వీటిని ఏర్పాటు చేస్తున్నామని 40 రోజుల్లో నిర్మాణం పూర్తి చేసుకొని యువతకు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఇక్కడ డిమాండ్ ను బట్టి జాతీయ రహదారిపై మరదలు ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. రామవరప్పాడు, బాపులపాడు గ్రామాల్లోనూ ఇదేవిధంగా కోర్టులు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, గూడపాటి తులసి మోహన్, మద్దినేని వెంకటేశ్వరరావు, కొమ్మరాజు సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

## జీవవైవిధ్య సంరక్షణ - ప్రతి ఒక్కరి బాధ్యత



**కాకినాడ,మే 13 (వార్తాప్రభ) :** అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం పురస్కరించుకొని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలి ఆధ్వర్యంలో కాకినాడ అర్బన్,రూరల్ మండలాల స్థాయిలో "ప్రకృతితో సామరస్యం, సుస్థిర అభివృద్ధి" అనే అంశంపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు జిల్లా కేంద్ర గ్రంథాలయం, కాకినాడలో నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ పాఠశాలల నుండి 94 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాలవేదిక కన్వీనర్ నోరి బలరామకృష్ణ మాట్లాడుతూ, జీవవైవిధ్య సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలనీ,ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఉప గ్రంథాలయాధికారి ఇన్చార్జి కె.కిషోర్ మాట్లాడుతూ,భవిష్యత్ తరాల కోసం పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని సూచించారు.ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ప్రాంతీయ సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో జీవవైవిధ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఈ పోటీలు రాష్ట్ర జీవవైవిధ్య మండలి సభ్య కార్యదర్శి పి.రామకృష్ణ అధ్వర్యంలో నిర్వహిఒంచబడ్డాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బి.సూర్యనారయణ, సినియర్ అసిస్టెంట్ ఎల్.వెంకటేశ్వరావు, ప్రముఖ ఇంద్రజాలకుడు వి.ఎస్.వి రమణమూర్తి , గ్రంథాలయ సిబ్బంది ఎన్.రాజు, కె.ప్రియదర్శిని, జి.దుర్గప్రసాద్, ఎ.వి.ఎన్.నాగేంద్ర కుమార్,వి.అరుణ, టి.వీర్రజు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ దేవాలయం లో భక్తులకు అన్న సమారాధన



**హనుమాన్ జంక్షన్,మే 13 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్ నూజివీడు రోడ్ లో ప్రసిద్ధి చెందిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ తవ్వా పూర్ణచంద్రరావు దంపతుల వితరణతో హనుమాన్ జంక్షన్ లోని ప్రసిద్ధ శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న అన్నసమారాధన కార్యక్రమాన్ని ఈ రోజు ఏర్పాటు చేశారు.200 మందికి పైగా భక్తులు ఈ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలు తవ్వా పూర్ణ పూర్ణచంద్రరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, ఆలయ సిబ్బంది, అర్చకులు, సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

## తిరుమలలో వీఐపీ సిఫార్సు లేఖల స్వీకరణపై మంత్రి ఆనం కీలక ప్రకటన

**తిరుమల,మే 13 (వార్తాప్రభ) :** తిరుమలలో ఈ నెల 15 (గురువారం) నుంచి వీఐపీ సిఫారసు లేఖలను స్వీకరిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఏపీ, తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై ఎల్లుండి నుంచి బ్రేక్ దర్శనాలు ఉంటాయని మంత్రి ప్రకటించారు. కాగా, మే 1 నుంచి జులై 15 వరకు సిఫారసు లేఖల బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు గతంలో టీటీడీ ప్రకటించిన విషయం తెలిసిందే. టీటీడీ బోర్డు సభ్యులు, ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు చెల్లవని స్పష్టం చేసింది. ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయని చెప్పింది.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188